# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 103 | అసోసియేట్ ఎడిటర్ : మార్పు సాయి కుమార్ | పేజీలు : 8, | వెల రూ. 5, | సోమవారం - 22 - జూలై - 2024

Publisher from Srikakulam: circulated at vijayanagaram Visakhapatnam East Godavari West Godavari Krishna guntur Prakasam Kurnool Nellore Chittoor Kadapa ananthapuram Hyderabad



విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## కేరళలో నిపా వైరస్ కలకలం



- తాజాగా, రాష్ట్రంలో నిపా వైరస్ సోకిన 14ఏళ్ల బాలుడు ప్రాణాలు కల్పోయాడు.
- మళప్పురం జిల్లాలోని పండిక్కడ్‌కు చెందిన 14ఏళ్ల బాలుడికి నిపా వైరస్ సోకినట్లు శనివారం వెల్లడించారు
- నిపా వైరస్ సోకినట్లు నిర్ధరించిన కొన్ని గంటల వ్యవధిలోనే మరణించడం ఆందోళన

తాజాగా, రాష్ట్రంలో నిపా వైరస్ సోకిన 14ఏళ్ల బాలుడు ప్రాణాలు కల్పోయాడు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు కేరళ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ ఆదివారం వెల్లడించారు. అతడికి నిపా వైరస్ సోకినట్లు నిర్ధరించిన కొన్ని గంటల వ్యవధిలోనే మరణించడం ఆందోళన కలిగిస్తోంది. మళప్పురం జిల్లాలోని పండిక్కడ్‌కు చెందిన 14ఏళ్ల బాలుడికి నిపా వైరస్ సోకినట్లు శనివారం వెల్లడించారు వీణా జార్జ్. పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ఈ విషయాన్ని నిర్ధరించిందని, ప్రైవేటు ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై మిగతా..2లో

## ఏపీలో ప్రభుత్వం మారినా ఇంకా ఇదేం పద్ధతి..?

- కూటమి ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- సీఎం నారా చంద్రబాబు సంతకం పెట్టడం, కేబినెట్ కూడా ఆమోదించినప్పటికీ ఇంతవరకూ
- ప్రభుత్వం మారి 45 రోజులు దాటింది కూడా..! అయినా సరే ఇంకా పాత వాసనలు పోలేదనే విమర్శలు
- వైసీపీ హయాంలో మారిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ పేరును.
- మారని అధికారుల తీరుపై.. ఇష్టానుసారం ప్రకటనలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు క్లాస్ తీసుకోగా..



ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని రీతిలో కూటమి ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారి 45 రోజులు దాటింది కూడా..! అయినా సరే ఇంకా పాత వాసనలు పోలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి..! ఎందుకంటే.. సీఎం నారా చంద్రబాబు సంతకం పెట్టడం, కేబినెట్ కూడా ఆమోదించినప్పటికీ ఇంతవరకూ యూనిర్శిటీ పేరు మారకపోవడం గమనార్హం. దీంతో అసలు ఏం జరుగుతోంది..? ఇదంతా పనిగట్టుకునే చేస్తున్నారా..? లేకుంటే మరో కారణం ఏమైనా ఉందా అనే అనుమానాలు కలుగుతున్న పరిస్థితి. వైసీపీ హయాంలో మారిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ పేరును.. కూటమి అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా మార్చింది. ఇందుకు సీఎం నారా చంద్రబాబుతో పాటు కేబినెట్ ఆమోదం కూడా లభించింది. అయినా ఇంకా ప్రభుత్వ ప్రకటనల్లో మాత్రం పేరు మారలేదు. ఆదివారం నాడు ఓ దిన పత్రికలో డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఎండీఎస్ మేనేజ్మెంట్ కోటా, కాంపిటేట్ అథారిటీ కోటా పేరుతో అడ్మిషన్స్‌కు పత్రిక ప్రకటన ఇవ్వడం జరిగింది. ఈ ప్రకటనను యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రాధికా రెడ్డి రిలీజ్ చేశారు. అయితే.. యూనివర్శిటి పేరు మారిందన్న విషయం రిజిస్ట్రార్ మరిచిపోయారో లేకుంటే ఇంకేం జరిగిందో తెలియట్లేదు కానీ.. మిగతా..2లో

## మూడురోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు



- తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు
- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.
- పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది.

తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఒడిశా పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం వాయువ దిశగా కదులుతూ ఉదయం 8.30 ఒడిశాను ఆనుకొని ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగుతుందని వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న 12గంటల్లో ఛత్తీస్‌గఢ్ మీదుగా మిగతా..2లో

# రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కన్నా.. మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్

మూసీని అందంగా ముస్తాబు చేసేందుకు.. మొన్న రూ.50వేలకోట్లు ఖర్చు అవుతుందన్నారని.. నిన్న.. రూ.70వేలకోట్లు వెచ్చిస్తామన్నారని..

తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80వేల కోట్లయితేనే గల్లీ నుంచి ఢిల్లీదాకా గగ్గోలుపెట్టింది




పుట్టిన గడ్డపై మమకారం లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కన్నా.. మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. మూసీని అందంగా ముస్తాబు చేసేందుకు.. మొన్న రూ.50వేలకోట్లు ఖర్చు అవుతుందన్నారని.. నిన్న.. రూ.70వేలకోట్లు వెచ్చిస్తామన్నారని.. నేడు.. మిగతా..2లో

## తెలంగాణకు పోటెత్తుతున్న వరద..




వర్షాకాలం ప్రారంభమైన నెల రోజుల తర్వాత భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదులు, వాగులు, వంకలకు జల కళ సంతరించుకుంది. కృష్ణా పరివాహక ప్రాంతానికి ఇప్పుడిప్పుడే వరద చేరుకుంటుండగా.. గోదావరి పరివాహక జలశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. మొన్నటి దాకా ఎండలతో నీరు లేక అడుగంటిన జలశయాలకు భారీగా వరద చేరుకుంటోంది. అయితే కూలిపోయిందని ప్రచారం జరిగిన కాళేశ్వరం మళ్లీ పూర్వరూపం సంతరించుకుంది. మేడిగడ్డ బ్యారేజ్ భారీ వరదతో కళకళలాడుతోంది. 85కు 85 గేట్లు తెరచుకోవడంతో వరద కిందకు వెళ్తోంది. గోదావరి పరివాహకంలోని అన్ని ప్రాజెక్టులకు భారీగా వరద చేరుతోంది.

# 36రాజకీయ హత్యలు జరిగాయని మాజీ ముఖ్యమంత్రి జగన్

## ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత



- నూతన ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్‌పై చర్యలు తీసుకుంటామని అనిత హెచ్చరించారు.
- 36హత్యలు జరిగాయని జగన్ చెప్తున్నారు,
- ఏపీ ప్రభుత్వాన్ని ఎవరైనా టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు
- వినుకొండలో రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన జగన్ రాజకీయాలు
- ఏపీ ప్రభుత్వాన్ని ఎవరైనా టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు

## తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.25 కోట్లు



వేంకటేశ్వరాస్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తున్న భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి.

భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 4.25 ఆదాయం వచ్చిందన్నారు.

తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది.

## గురు పౌర్ణమి ఎందుకు జరుపుకుంటారు..




- మన దేశంలో హిందువులకు ఎన్నో పండుగలు ఉన్నాయి.
- పండుగల్లో గురు పౌర్ణమి పండుగ ఒకటి.
- గురువులకు కృతజ్ఞత చెప్పుకునేందుకు జరుపుకునే పండుగ.

మన దేశంలో హిందువులకు ఎన్నో పండుగలు ఉన్నాయి. అలాంటి పండుగల్లో గురు పౌర్ణమి పండుగ ఒకటి. ఈ పర్వదినాన్ని ఎంతో ప్రత్యేకమైన, పవిత్రమైన పండుగగా జరుపుకుంటారు. ఏటా హిందూ సంప్రదాయం ప్రకారం.. ఈ పండుగ ఆషాఢ పౌర్ణమి తిథి రోజున వస్తుంది. మిగతా..2లో

## బంగ్లా బాధితులకు ఆశ్రయం..

- హింసాత్మక ఘటనలను అడ్డుకొనేందుకు దేశవ్యాప్తంగా కర్ఫ్యూ
- ఆదివారం కోల్‌కతాలో నిర్వహించిన మైత్రీస్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు.
- పొరుగు దేశం నుంచి వచ్చే శరణార్థులను గౌరవించాలని గతంలో ఐక్య రాజ్య సమితి చేసిన తీర్మానం



కోల్‌కతా, జులై 21: రిజర్వేషన్ల సంస్కరణ కోసం జరుగుతున్న అల్లర్లతో బంగ్లాదేశ్ అతలాకుతలం అవుతుంది. హింసాత్మక ఘటనలను అడ్డుకొనేందుకు దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించినా.. మిగతా..2లో

# వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా యాసిఫ్


-ఆదివారం తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శృతి ముకూరి

-వెయిట్ లిఫ్టింగ్ తో శారిరక దారుఢ్యం పెంపొందించుకోవడం తోపాటు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఏర్పడుతుంది.



జనగామ (జనం రిపోర్టర్) : తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనగామ జిల్లా అధ్యక్షునిగా ఎండీ యాసిఫ్ నియామ కమయ్యారు. వెయిట్ లిఫ్టింగ్ తో శారిరక దారుఢ్యం పెంపొందించు కోవడం తోపాటు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఏర్పడుతుంది. ఆదివారం తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శృతి ముకూరి నుంచి నియామాక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనపై నమ్మకంతో అధ్యక్షునిగా నియమించడం సంతోష కరమని మరింత ఉత్సహంతో పని చేస్తానని తెలిపారు.

## బంగ్లాదేశ్ అల్లకల్లోలం..



ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటా అంశం బంగ్లాదేశ్‌ను అగ్నిగుండంగా మార్చింది. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో కర్ఫ్యూ వంటి కఠిన ఆంక్షలు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ సైన్యం కూడా అప్రమత్తమైంది. అక్కడ ఎటువంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రకటించింది. " ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో బీఎస్ఎఫ్ కూడా ఆందోళన చెందుతోంది. ప్రస్తుత పరిస్థితిని అసాంఘిక శక్తులు ఆసరాగా చేసుకునే అవకాశాలున్న నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశాం" అని బీఎస్ఎఫ్ త్రిపుర విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ పటేల్ పీయూష్ పురుషోత్తం దాస్ పేర్కొన్నారు. సంసిద్ధతలో భాగంగా భారీ సంఖ్యలో సైనిక బలగాలు, సీనియర్ ఉన్నతాధికారులందర్నీ సరిహద్దులో మోహరించామని చెప్పారు.

# మూడురోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి..)

వాయువ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది. రుణపవన ద్రోణి సగటు సముద్రమట్టం వద్ద జైసల్మేర్, కొటా, గుణ, మాండ్లా, ఇంటీరియర్ ఒడిశా, ఛత్తీస్‌గఢ్.. తూర్పు–ఆగ్నేయ బంగాళాకాతం మీదుగా అల్పపీడనం మధ్యగా వెళ్తుందని తెలిపింది. ఈ క్రమంలో రాగల మూడురోజు రోజుల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లా భారీ వర్షాపాతం నమోదైంది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, హన్మకొండ, ములుగు, ఆదిలాబాద్‌లో భారీ నుంచి అతిభారీ వర్షాపాతం రికార్డయ్యింది. మరికొద్ది జిల్లాల్లో మోస్తరు వాన కురిసింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా వెంపల్లెలో 18.5 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైంది. అలాగే, ముప్కల్‌లో 12.5, అలూర్‌లో 15, నవీపేటలో 11.8, రేంజల్‌లో 11.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా మామడలో 13.8, ఖానాపూర్‌లో 11.9, ములుగ జిల్లా మల్లంపల్లిలో 12.7 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# గురు పౌర్ణమి ఎందుకు జరుపుకుంటారు..

(మొదటి పేజీ తరువాయి..)

ఆషాఢ పౌర్ణమి తిథి రెండు రోజులు.. అంటే మిగులు తగులుగా వచ్చింది. అంటే పౌర్ణమి తిథి జూలై 20న సాయంత్రం 5:59 గంటలకు ప్రారంభమై జూలై 21న మధ్యాహ్నం 03:46 గంటలకు ముగుస్తుంది. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యోదయం సమయంలో ఉన్న తిథిని పరిగణలోకి తీసుకుంటారు. కాబట్టి ఆషాఢ పౌర్ణమి తిథి సూర్యోదయం జూలై 21న ఉదయం 05:37 గంటలకు జరుగుతుంది. కాబట్టి జూలై 21న గురు పౌర్ణమి వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ గురు పౌర్ణమి ప్రత్యేకత ఏమిటి..? ఈ పర్వదినాన్ని ఎందుకు జరుపుకుంటారు..? తదితర వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం..

గురు పౌర్ణమి ప్రత్యేకత ఏమిటి..?

ఈ గురు పౌర్ణమి పండుగకు ఒక ప్రత్యేకత ఉన్నది. ఇది గురువులకు కృతజ్ఞత చెప్పుకునేందుకు జరుపుకునే పండుగ. ఎందుకంటే సనాతన హైందవ ధర్మంలో తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువుకే దక్కింది. పైగా ఈ సృష్టిలో మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేదాకా ప్రతిక్షణం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడు. అందులో కొంత తల్లిదండ్రుల వద్ద నేర్చుకుంటే మిగిలినదంత గురువు దగ్గరే నేర్చుకుంటాడు. అందుకే గురువును.. 'గురు బ్రహ్మ.. గురు విష్ణు.. గురు దేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పర బ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః' అని కీర్తిస్తారు. సంస్కృతంలో 'గు' అనే శబ్దానికి చీకటి అని అర్థం. 'రు' అంటే తేజస్సు అని అర్థం. అంటే అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానం అనే వెలుగుని ప్రసాదించేవాడే గురువు అని అర్థం. మన గమ్యానికి దారి చూపించేవాడే గురువు. మనకు తెలియని విషయాలను చెప్తూ.. అజ్ఞానాన్ని తొలగించే జ్ఞాన సంపన్నుడు, గుణసంపన్నుడుగా గురువు ఉంటాడు. పురణాల ప్రకారం గురు పూర్ణిమ రోజునే వ్యాస మహర్షి జన్మించాడట. అందుకే ఈ గురు పౌర్ణమిని వ్యాస పూర్ణిమ అని కూడా అంటారు. ఆయన జన్మదినాన్ని ఒక మహా పర్వదినంగా జరుపుకోవడం తరతరాలుగా కొనసాగుతోంది. ఈ రోజున గురు భగవానుడిని, వ్యాస మహర్షిని పూజించే వారికి అష్టైశ్వర్యాలు కలుగుతాయి. అందుకే ఈ రోజున గురువులను నమస్కరించి పూజించుకోవాలి.

# తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.25 కోట్లు

(మొదటి పేజీ తరువాయి..)

తిరుమల : తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేంకటేశ్వరాస్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తున్న భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 16-18 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 83,538 మంది భక్తులు దర్శించుకోగా 30,267 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 4.25 ఆదాయం వచ్చిందన్నారు.

తిరుమలలో శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారి నేతృత్వంలో చాతుర్మాస దీక్ష సంకల్పం జరిగింది. ఈ సందర్భంగా పెద్దజీయర్‌స్వామి మాట్లాడుతూ, వైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైందన్నారు. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని తెలిపారు. కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారని, చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోందని వివరించారు. శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద టీటీడీ ఈవో జె.శ్యామల రావు, జేఈవో వీరబ్రహ్మం సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, చిన్నజీయంగారికి ఉల్ చాట్ వస్త్రాన్ని బహూకరించారు.

# కేరళలో నిపా వైరస్ కలకలం సృష్టిస్తోంది.

(మొదటి పేజీ తరువాయి..)

ఆ బాలుడు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. బాధితుడిని కోజికోడ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించనున్నట్లు తెలిపారు. అతడికి ఎవరెవరు దగ్గరగా వచ్చారన్నది ఆరా తీస్తున్నట్లు చెప్పారు. ఇంతలోనే బాలుడు మృతిచెందాడు. అంతర్జాతీయ నిబంధనలు పాటించి అంత్యక్రియలు నిర్వహిస్తామని వీణాజార్జ్? చెప్పారు. దీనిపై బాలుడి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాగా, నిపా వైరస్ ఇన్ఫెక్షన్ అనేది పందులు, గబ్బిలాలు వంటి జంతువులు, పక్షుల నుంచి మనుషులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధి. నిపా సాధారణంగా జంతువుల నుంచి లేదా కలుషితమైన ఆహారం ద్వారా మానవులకు వ్యాపిస్తుంది, అయితే ఇది నేరుగా వ్యక్తుల మధ్య కూడా వ్యాపిస్తుంది. దీని లక్షణాలలో తీవ్రమైన జ్వరం, వాంతులు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్ ఉన్నాయి. అయితే తీవ్రమైన సందర్భాల్లో మూర్ఛలు, మెదడు వాపులు ఉండవచ్చు. దీని ఫలితంగా కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంది కాగా, నిపాకు వ్యాక్సిన్ లేకపోవడం గమనార్హం.

# రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి..)

రూ.1.50లక్షలకోట్లు వెచ్చిస్తామంటున్నారన్నారు. తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80వేల కోట్లయితేనే గల్లీ నుంచి ఢిల్లీదాకా గగ్గోలుపెట్టింది కాంగ్రెస్ మరి.. సుందరీకరణకే రూ.1.50లక్షల కోట్లు ఖర్చు చేస్తుందా? అంటూ విమర్శించారు. ఇంతకీ మూసీ ప్రాజెక్టుతో.. మురిసే రైతులెందురు.. నిల్వ ఉంచే టీఎంసీలెన్ని.. సాగులోకి వచ్చే ఎకరాలెన్ని.. పెరిగే పంటల దిగుబడి ఎంత.. తీర్చే పారిశ్రామిక అవసరాలెంత.. కొత్తగా నిర్మించే భారీ రిజర్వాయర్లెన్ని.. అంటూ నిలదీశారు. చివరిదశలో ఉన్న ప్రాజెక్టును పక్కనపెట్టి.. కోల్డ్ స్టోరేజీలోకి నెట్టి మూసీ చుట్టే ఎందుకింత మంత్రాంగం అంటూ ధ్వజమెత్తారు. లండన్‌లోని థేమ్స్ లాగా మారుస్తామనే వ్యూహం వెనక థీమ్ ఏంటి ? గేమ్ ప్లాన్ ఏంటీ? ముఖ్యమంత్రి గారూ అంటూ ప్రశ్నించారు. మూడింతలు పెంచిన మూసీ అంచనా వ్యయం కాంగ్రెస్ ధనదాహానికి సజీవ సాక్ష్యమని.. మూసీ ప్రాజెక్టును చేపట్టాల్సిందేనని.. సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాల్సిందేనన్న కేటీఆర్.. మాటల దశలోనే ఉన్న ప్రాజెక్టులో మూటలు పంచుకునే పని షురూ చేస్తే సహించమని స్పష్టం చేశారు. తట్టెడు మన్ను తీయకముందే.. కోట్లు తన్నుకుపోయే కుట్రకు తెరతీస్తే భరించమని.. 'మూసీ రివర్ ఫ్రంట్' పేరుతో బ్యాక్ డోర్‌లో జరుగుతున్న బాగోతాన్ని తెలంగాణ సమాజం అనుక్షణం గమనిస్తోందని.. కుంభకోణాల కాంగ్రెస్‌కు కర్రుగాల్చి వాతపెడుతుందంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

# ఏపీలో ప్రభుత్వం మారినా ఇంకా ఇదేం పద్ధతి..?

(మొదటి పేజీ తరువాయి..)



ప్రకటన అలాగే ఇవ్వడంతో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. మారని అధికారుల తీరుపై.. ఇష్టానుసారం ప్రకటనలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు క్లాస్ తీసుకోగా.. మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటామని వివరణ ఇచ్చుకున్నట్లు తెలిసింది.

## నాటి నుంచి నేటి వరకూ..!

వాస్తవానికి.. వైసీపీ హయాంలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్.. అధికారులు, ఉన్నతాధికారులు, యూనివర్శిటీ వీసీలు ఇలా ఎక్కడా పాత వాసనలు లేకుండా ఇప్పుడిప్పుడే కూటమి సర్కార్ ప్రక్షాళన చేస్తూ వస్తోంది. ఆ మధ్య జీపీఎస్ జీవో, గెజిట్ రిలీజ్ వ్యవహారంలో ఎంత రాద్ధాంతం జరిగిందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఆఖరికి విచారణ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా రిజిస్ట్రార్ తీరుతో మరోసారి పాత వాసన అనేది బయటపడింది. అందుకే.. ఇకపై ఎలాంటి ప్రకటన అయినా, జీవోలు, గెజిట్‌ల విషయంలో ఒకటికి పదిసార్లు క్రాస్ చెక్ చేసుకుని ఉన్నతాధికారుల అనుమతితో రిలీజ్ చేయాలని అన్ని విభాగాలకు సమాచారం క్లియర్ కట్‌గా వెళ్లిందని తెలిసింది.

# తెలంగాణకు పోటెత్తుతున్న వరద..




(మొదటి పేజీ తరువాయి..)

కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ వద్ద ఉధృతంగా గోదావరి ప్రవహిస్తోంది. కాళేశ్వరం పుష్కర ఘాట్లకు నేరు చేరింది. కాళేశ్వరం గోదావరి వద్ద నీటిమట్టం 8.500 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. లక్ష్మీ బ్యారేజ్‌కి భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ 85 గేట్లు ఎత్తి 3,73,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల. ఇన్ ఫ్లో , ఔట్ ఫ్లో 3,73,500 క్యూసెక్కులు ఉంది.

లక్ష్మీ బ్యారేజ్ పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 16.17 టీఎంసీలు

హైదరాబాద్ ప్రజలకు బిగ్ అలర్ట్.. 2 రోజులు ఎంఎంటీఎస్ రైళ్లు బంద్

భద్రాచలం కొన్ని రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో వాగులు, వంకలు వర్షం నీటితో ముంచెత్తిపోతున్న తరుణంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుంది. గంటగంటకు క్రమేపి గోదావరి నీటిమట్టం పెరగటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.8 అడుగులు దాటి ప్రవహిస్తుంది. 43 అడుగులకు చేరితే ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచారు. దిగువ ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ జీతిస్ వి పాటేల్ ఆలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మిడ్‌మానేర్ ప్రాజెక్టు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేరు)కు 525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి మానేరు, మూల వాగుల నుంచి వరద చేరుతోంది. పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు (318 మీటర్లు) ప్రస్తుత నీటి నిల్వ 5.61 టిఎంసీలు (305.33 మీటర్లు)

నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్ట్‌కు వరద నీరు చేరుతుంది. వరద ఇన్ ఫ్లో 19,686 క్యూసెక్కులు వస్తుంది. దీంతో నాలుగు గేట్లను ఎత్తివేసిన అధికారులు దిగువకు 18,227 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కొద్ది రోజుల కిందట ఎండిపోయి కడెం ప్రాజెక్టు వెలవెలపోగా.. ఇప్పుడు వరదతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2022, 23లలో కడెం ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయి ప్రమాదకర స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. రెండేళ్లు కడెం ప్రాజెక్టు భయానక పరిస్థితికి చేరుకున్న నేపథ్యంలో అధికారులు కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేశారు. అయినా కూడా పరివాహక రైతుల్లో ఆందోళన నెలకొనే ఉంది.

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 80.5 టీఎంసీలు ప్రస్తుతం 19.185 టీఎంసీలు పూర్తి స్థాయి నీటిమట్టం 1067.40 మీటర్లు ప్రస్తుతం 332.53 మీటర్లు ఇన్‌ఫ్లో 18,518 క్యూసెక్కులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమాచారం ఇన్ ఫ్లో : నిల్ ఔట్ ఫ్లో : 9,874 క్యూసెక్కులు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు ప్రస్తుతం504.50 అడుగులు పూర్తిస్థాయి నీటి నిల్వ 312.5050 టీఎంసీలుప్రస్తుతం122.5225 టీఎంసీలు పియదర్శిని జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు ప్రస్తుతం 7.645 టీఎంసీలు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు ప్రస్తుతం 317.500 మీటర్లు శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ ఫ్లో 90,800 క్యూసెక్కులు స్పిల్ వే 17 గేట్లు ఎత్తివేత 66,810 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి: 33,084 క్యూసెక్కులు శ్రీశైలం అవుట్ ఫ్లో:- 99,894 క్యూసెక్కులు పూర్తిస్థాయి అవుట్ ఫ్లో:- 1,04,416 క్యూసెక్కులు

# 36రాజకీయ హత్యలు జరిగాయని మాజీ ముఖ్యమంత్రి జగన్

(మొదటి పేజీ తరువాయి..)



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 36రాజకీయ హత్యలు జరిగాయని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా మండిపడ్డారు. నూతన ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్‌పై చర్యలు తీసుకుంటామని అనిత హెచ్చరించారు. 36హత్యలు జరిగాయని జగన్ చెప్తున్నారు, వాటి వివరాలు ఆయన ఇవ్వగలరా? అంటూ ఆమె సవాల్ విసిరారు. రాజకీయ హత్యల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి జగన్ ఇవ్వాలని, లేకుంటే ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

దమ్ముంటే అసెంబ్లీకి జగన్ రావాలి..

ఏపీ ప్రభుత్వాన్ని ఎవరైనా టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు. మైకు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు చేస్తే చట్టం ఎందుకు ఊరుకోవాలని ఆమె ప్రశ్నించారు. రాజకీయ హత్యలు జరిగాయంటూ నోటికొచ్చిన నంబర్ చెప్పేస్తే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా తప్పించుకునేందుకే ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీలో జగన్ ధర్నా చేయబోతున్నట్లు ఆమె చెప్పుకొచ్చారు. ఆయనకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీలో శాంతి భద్రతలపై మేము ప్రవేశపెట్టే శ్వేతపత్రంపై జగన్ చర్చించగలరా?, తప్పుడు ప్రచారం చేయడం ఆయనకు అలవాటుగా మారిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు ఇంకా తన మాట నమ్ముతారనే భ్రమలో ఆయన ఉన్నారని హోంమంత్రి అనిత ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిపై మాజీ మంత్రి జోగి రమేశ్ దాడి చేశారని, జై జగన్ అని అనలేదని చంద్రయ్య అనే టీడీపీ కార్యకర్తను దారుణంగా పీక కోసి చంపేశారని ఆమె గుర్తు చేశారు. రోడ్డు మీద పరదాలు కట్టడానికి, చెట్లు నరకడానికి, టీడీపీ నేతలను వేధించడం కోసం మాత్రమే పోలీసులను జగన్ వాడుకున్నారు. నెల రోజుల కాలంలో మేం ఎక్కడన్నా వైసీపీ నేతలను హౌస్ అరెస్టులు చేశామా?. అడుగడుగునా అడ్డుకున్న వైసీపీది ఆటవిక పాలనా లేక యథేచ్ఛగా రోడ్డు మీద తిరుగుతున్నా జగన్‌ను అడ్డుకోని మాదా ఆటవిక పాలన? అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో దిశా పోలీస్ స్టేషన్ ప్రారంభించిన సాయంత్రమే గ్యాంగ్ రేప్ జరిగింది. నేరాలు, హత్యలు, అత్యాచారాలపై సీఎంగా ఉన్నప్పుడు ఒక్కసారైనా స్పందించారా?. లా అండ్ ఆర్డర్, గంజాయిపై ఒక్కసారైనా సమీక్ష జరిపారా అంటూ అనిత ప్రశ్నల వర్షం కురిపించారు.

**వివేకా హత్యపై మాట్లాడగలరా?**

వినుకొండలో రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన జగన్ రాజకీయాలు మాట్లాడారే తప్ప కనీసం బాధిత కుటుంబానికి ఒక్క రూపాయి కూడా అందజేయలేదని హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సంపాదించిన అక్రమ ఆస్తిలో నుంచి డబ్బులు ఇవ్వలేకపోయిన జగన్‌కు బాధిత కుటుంబంపై ప్రేమ ఉందంటే ఎవరు నమ్ముతారంటూ ఆమె ప్రశ్నించారు. సీఎంగా ఆయన పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. అమరావతిలో ఉన్న పాపానికి ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణానికి గత ప్రభుత్వం డబ్బులు కూడా ఇవ్వలేదు. ఢిల్లీలో జగన్ కూర్చొని వివేకా హత్య గురించి చెప్పగలరా?. చంద్రబాబుపై రాళ్లు వేసి భావ ప్రకటన స్వేచ్ఛ అని కామెంట్లు చేసిన వైసీపీ నేతలా మమ్మల్ని విమర్శిస్తోందని ఆమె దుయ్యబట్టారు. గతంలో ఏం జరిగిందో గుర్తు చేసుకో పులివెందుల ఎమ్మెల్యే అంటూ ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఐదేళ్లపాటు రాజారెడ్డి రాజ్యాంగం!

ఏపీలో గత ఐదేళ్లలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని హోంమంత్రి ధ్వజమెత్తారు. వైసీపీ నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, విజయసాయి రెడ్డి అంశాన్ని పక్కకు పెట్టేందుకే రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయంటూ జగన్ హడివిడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం మీద కావాలనే నిందలు వేస్తున్నారు. రాజకీయ హత్యలు కేవలం 4మాత్రమే జరిగాయని, బాధితుల్లో ముగ్గురు టీడీపీ నాయకులే ఉన్నట్లు ఆమె చెప్పుకొచ్చారు. అధికారం కోల్పోయిన నెల రోజుల్లోనే జగన్‌కు అధికార కాంక్ష పట్టుకుంది. చంపుకోవడం తప్పు దాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎం కుర్చీలో కూర్చోవడం కోసం బాబాయి హత్య, కోడికత్తి డ్రామా నడిపారు. ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తే జగన్‌పై కూడా కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. జగన్ అకృత్యాలపై మేము కూడా ఢిల్లీలో మాట్లాడతాం. వినుకొండ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై కేసు నమోదు చేస్తామని హోం మంత్రి అనిత హెచ్చరించారు.

# బంగ్లా బాధితులకు ఆశ్రయం.

(మొదటి పేజీ తరువాయి..)



ఆ దేశంలో అల్లర్లు మాత్రం ఆగడం లేదు. అలాంటి వేళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. ఆదివారం కోల్‌కతాలో నిర్వహించిన మైత్రీస్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడారు.

శ్రీ విద్యా పీఠంలో గురుపౌర్ణమి వేడుకలు

బంగ్లాదేశ్ హింసలో బాధితులుగా మారిన వారు పశ్చిమ బెంగాల్ వస్తే.. ఆశ్రయం కల్పిస్తామని వారికి భరోసా ఇచ్చారు. బాధితులు తమ తలుపు కొడితే.. వారికి ఆశ్రయం కల్పించేందుకు తాము సిద్దంగా ఉన్నామని స్పష్టం చేశారు. అయితే బంగ్లాదేశ్ వేరే దేశమని చెప్పారు. ఆ దేశం గురించి తానేమి మాట్లాడ లేనన్నారు. దీనిపై భారత ప్రభుత్వం మాట్లాడుతోందని మమతా బెనర్జీ పేర్కొన్నారు. అయితే పొరుగు దేశం నుంచి వచ్చే శరణార్థులను గౌరవించాలని గతంలో ఐక్య రాజ్య సమితి చేసిన తీర్మానాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

బీజేపీతోపాటు ఎల్జీపై మళ్లీ మండిపడ్డ ఆప్

హింసాత్మకంగా మారిన బంగ్లాదేశ్‌లోని బంధువులు వద్ద చిక్కుకున్న బెంగాల్ నివాసితులకు తాను అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా మమత హామీ ఇచ్చారు. ఈ ర్యాలీలో సమాజావాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ సైతం పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఆయన మోదీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**జగన్ పాలనలో అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం**

1971లో దేశ స్వాతంత్ర్యంలో పాల్గొన్న సమరయోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో బంగ్లాదేశ్ ప్రభుత్వం 30 శాతం రిజర్వేషన్లను కల్పిస్తుంది. ఈ 30 శాతం కోటాపై దేశవ్యాప్తంగా చాలా కాలంగా విమర్శలు అయితే వెల్లువెత్తుతున్నాయి. అయితే ఆ విధానానికి స్వస్తి పలికి.. ప్రతిభకు పట్టం కట్టాలన్న డిమాండ్ ఆ దేశంలో రోజు రోజుకు తీవ్రమవుతుంది. అందులోభాగంగా పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు నిచ్చారు. ఆ ఆందోళనలో విద్యార్థులతోపాటు ప్రజలు సైతం భారీగా పాల్గొంటున్నారు. అయితే ఈ ఆందోళన హింసాత్మకంగా మారింది. దీంతో ఈ అల్లర్లలో దేశవ్యాప్తంగా 104 మంది మరణించారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు బంగ్లాదేశ్‌లోని భారతీయ విద్యార్థులు వెయ్యి మంది భారత్‌లని తమ తమ స్వస్థలాలకు క్షేమంగా చేరుకున్నారు.

# రికార్డు సృష్టించనున్న నిర్మలమ్మ




న్యూఢిల్లీ, జులై 21: వరుసగా ప్రధానిగా నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి బాధ్యతలు చేపట్టడం ద్వారా నెహ్రూ రికార్డును సమం చేశారు. అలాగే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సైతం సరికొత్త చరిత్ర సృష్టించనున్నారు. వరుసగా ఆమె ఏడోసార్లు బడ్జెట్‌ను నేరుగా సభలో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో గతంలో వరుసగా ఆరుసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డును నిర్మలమ్మ అధిగమించబోతున్నారు.

ఇంటర్‌నేట్ సేవలు కట్..!

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండో రోజు.. అంటే మంగళవారం జులై 23న లోక్‌సభలో 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. 2019లో ప్రధానిగా నరేంద్ర మోదీ రెండో సారి బాధ్యతలు చేపట్టారు. ఆయన కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు వరుసగా ఆమె ఆరు బడ్జెట్‌లను ఆమె ప్రవేశపెట్టారు.

బంగ్లా బాధితులకు ఆశ్రయం.. కీలక ప్రకటన

అయితే ఈ ఏడాదిలో సార్వత్రిక ఎన్నికల జరిగాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో నిర్మల మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం విధితమే. అయితే 1959 నుంచి 1964 మధ్య మొరార్జీ దేశాయ్ వరుసగా ఆరు సార్లు కేంద్ర బడ్జెట్‌ను నేరుగా సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది ఎన్నికలు జరగడంతో.. మోదీ ప్రభుత్వం ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.

శ్రీ విద్యా పీఠంలో గురుపౌర్ణమి వేడుకలు

కానీ సార్వత్రిక ఎన్నికల్లో సైతం మళ్లీ ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. దీంతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో మోదీ ప్రభుత్వం కొలువు తీరింది. అయితే బీజేపీలోకి పలువురు అగ్రనేతలకు ప్రధాని మోదీ పాత శాఖలనే కేటాయించడం గమనార్హం. దీంతో నిర్మలా సీతారామన్ మళ్లీ ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

బీజేపీతోపాటు ఎల్జీపై మళ్లీ మండిపడ్డ ఆప్

ఇక 75 ఏళ్ల భారతావనిలో పలువురు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రులుగా వ్యవహరించినా.. నిర్మల, మొరార్జీ దేశాయ్‌లా వారంతా వరుసగా బడ్జెట్ ప్రవేశపెట్టక పోవడం గమనార్హం. దేశస్వాతంత్ర్యానంతరం తొలి బడ్జెట్‌ను ఆర్కే షణ్ముగం చారీ ప్రవేశపెట్టారు. ఇక నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి కేబినెట్‌లలో ఆర్థిక మంత్రిగా పని చేసిన మొరార్జీ దేశాయ్ మొత్తం 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అలాగే పి. చిదంబరం.. మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అదే విధంగా ప్రణబ్ ముఖర్జీ సైతం 8 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ అయితే 5 సార్లు సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

## ఉత్తమ రక్త దాత అవార్డు అందుకున్న గొల్ల పెల్లి నరేష్



చొప్పదండి, **జూలై 21 జనం రిపోర్టర్ :** తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక కార్యకర్తల రాష్ట్ర స్థాయి అవార్డు ప్రధానోత్సవాలలో భాగంగా కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల భూపాల పట్నం గ్రామానికి చెందిన సామాజిక కార్య కర్త , లయన్స్ క్లబ్ చొప్పదండి వైస్ ప్రెసిడెంట్, బ్లడ్ డొనేషన్ మోటివేటర్ గొల్ల పెల్లి నరేష్ ని తాను చేసిన సమాజ సేవలకి గాను ఉత్తమ రక్త దాత అవార్డు ను ముషీరాబాద్ ఎం.ఎల్.ఏ. ముఠా గోపాల్ మరియు తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైస్ అఫ్ ఫెడరేషన్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ వైస్చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా గొల్ల పెల్లి నరేష్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ ఉత్తమ రక్త దాత అవార్డు తీసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని,అత్యున్నతమైన ఉత్తమ పురస్కార అవార్డుకు ఎంపిక చేసినందుకు వైశ్య ఫెడరేషన్ కమిటీ సభ్యులకు మరియు వైశ్య మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ప్రతి ఒక్కరు సమాజ సేవలో తమ వంతుగా ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి సంబంధించిన సామాజిక కార్యకర్తలు, వైశ్య ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

## చొప్పదండి నూతన ఎస్.ఐ గా జి.అనూష భాధ్యతల స్వీకరణ




చొప్పదండి, **జూలై 21 జనం రిపోర్టర్ :** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 11 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ గత శుక్రవారం రోజున కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే.కాగా ఈ బదిలీల్లో భాగంగా కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలో గల చొప్పదండి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ. పనిచేస్తున్న ఉపేంద్రచారి బదిలీ కాగా ఆయన స్థానంలో 2018 బ్యాచ్ కు చెందిన జి.అనూష చొప్పదండి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా ఆదివారం నాడు బాధ్యతలు స్వీకరించారు.గతంలో రామడుగు ఎస్సైగా, అనంతరం రామగుండం కమిషనరేట్ కు బదిలీ పై వెళ్లిన ఆమె ఇటీవలే కరీంనగర్ కమిషనరేట్ కు బదిలీ పై వచ్చారు.

## జనసైనికుల సంక్షేమమే పవన్ కళ్యాణ్ ధ్యేయం మరణించిన ముగ్గురి కుటుంబాలకు నాగబాబు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ



పోలవరం **జూలై 21 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం నుండి ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు ప్రధాన కార్యదర్శి నాగబాబు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడం జరిగింది నాగబాబు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు జన సైనికులకు భరోసా కల్పించడమే జనసేన లక్ష్యమని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఐదు లక్షల చెక్కు పంపిణీ చేయడం జరిగింది ప్రతి ఒక్కరు కూడా ఈ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు పోలవరం నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వం తీసుకొని ప్రమాదవశాత్తు మరణించిన, ముగ్గురు కుటుంబ సభ్యులకు ,5 లక్షల చెక్‌లను నాగబాబు చేతుల మీదుగా అందించడం జరుగింది, 1.కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన, బల్లె లక్ష్మి నాగ శివకుమారి, కుటుంబానికి ఐదు లక్షల చెక్కు అందజేయడం జరిగింది 2. టి నర్సాపురం మండలం తిరుమల దేవి పేట



గ్రామానికి చెందిన ,జట్ల దుర్గారావు , కుటుంబానికి 5,లక్షల చెక్కు అందజేయడం జరిగింది 3. వెలేరుపాడు మండలం , వేలేరుపాడు గ్రామానికి చెందిన ఏపూరి రాజేష్ కుటుంబానికి 5,లక్షల రూపాయలు అందజేయడం జరిగింది అలాగే ఈ కార్యక్రమంలో నాగబాబు మాట్లాడుతూ జన సైనికులు



అందరూ కూడా సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు జనసేన వీర మహిళలు అందరూ కూడా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు అలాగే రెన్యువల్ చేయించుకోవాలని ప్రతి ఒక్క జన సైనికుడు కుటుంబానికి ఒక భరోసాగా ఉంటుందని ఆయన అన్నారు జనసైనికుల సంక్షేమమే లక్ష్యంగా సభ్యత్వం ఉంటుందని ఆయన అన్నారు పవన్ కళ్యాణ్ రూపొందించిన ఈ క్రియాశీలక సభ్యత్వం ప్రతి ఒక్క జన సైనికుడు కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన అన్నారు క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం వలన 5, లక్షల ప్రమాద జీవిత బీమా, 50 వేల వరకు ప్రమాద బీమా ఇవ్వటం జరుగుతుందని ఆయన అన్నారు కొయ్యలగూడెం మండల జనసేన అధ్యక్షులు తోట రవి, టీ .నర్సాపురం మండల జనసేన అధ్యక్షుడు కడప నాగరాజు, వెలేరుపాడు మండల జనసేన అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, జనసేన నాయకులు పాల్గొన్నారు

## జ్ఞాన సరస్వతి ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు




చొప్పదండి,**జూలై 21 జనం రిపోర్టర్ :** చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు మహిళా భక్తులు అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా మంగళహారతి ఇచ్చి అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు అనంతరం పల్లకి సేవ నిర్వహించారు.జయ జయ మాత జ్ఞాన సరస్వతి మాత అంటూ నినాదాలు చేస్తూ అమ్మవారిని ఆలయం చుట్టూ పల్లకి సేవ నిర్వహించారు.దాదాపు 300 మంది భక్తులు పాల్గొన్నారు అనంతరం ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్మోహన్ స్వామి శ్రీ భాష్యం నవీన్ కుమారులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి మంగళ శాసనాలను తెలిపారు అనంతరం అన్న ప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

## గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఎన్టీపీసీ సాయి సేవ సమితి సాయిబాబా కు అభిషేకాలు నిర్వహించిన ఆలయ పూజారి శంకర్ పాండే....



రామగుండం **జూలై 21 జనం రిపోర్టర్ :**ఆదివారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని, ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్లోని సాయి సేవ సమితి సాయిబాబా గుడిలో సాయినాధునికి అభిషేకాలు నిర్వహించిన ఆలయ పూజారి శంకర్ పాండే. అనంతరం పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం మహా ప్రసాదం, నైవేద్యం ( అన్నదానం) కార్యక్రమం, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహిస్తారని ,పల్లకి సేవ ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ రెడ్డి, ఏబిసి శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, రాజేందర్, యాదగిరి లలిత, నిర్మల, తిరుమల, రాజ్యలక్ష్మి, సరూప, తదితరులు సాయి భక్తులు పాల్గొన్నారు.

## అధైర్యపడవద్దు అండగా ఉంటాం

- వరద ప్రాంత ప్రజలు కు ఎమ్మెల్యే శిరీష దేవి భరోసా.



వి.ఆర్.పురం **జూలై 21 జనం రిపోర్టర్ :** అధైర్యపడవద్దు అండగా ఉంటాం అని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. ఆదివారం స్థానిక ఏపిడీఓ కార్యాలయం ఏర్పాటు చేసిన వరద సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శబరి,గోదావరి పర్శిహక ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టికి రావడంతో వెంటనే స్థానిక ఐటీడీఏ పీఓ, డిప్యూటీ డిఎమ్ అండ్ ఎచ్ వో, నాలగు మండలలా తహసిల్దార్ అప్రమత్తం చేశామని ఆమె అన్నారు. మూడు నెలల సరిపడ్డ నిత్యావసర సరుకులను బఫర్ స్టాక్ ఆయా మండలాలకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలి అని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని ఆయా అధికారాలకు చూచించారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన రహదారులు మరమ్మతులు చెయ్యాల్ని అధికారులకు ఆదేశాలు జారీ



చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చెయ్యాలని, సహాయక చర్యలు తెలుగుదేశం శ్రేణులు భాగం కావాలని ,నదులు, వాగులు వంకలు చెరువుల పొంగిపొర్లుతు దృష్ట్యా ప్రజలు వాటి దగ్గరకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికీ అప్పుడు వరద పై సమీక్ష చేస్తున్నారు అని అతి త్వరలోనే విలీన మండలాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో తాసిల్దార్ మౌలానా వాజిల్ ఎంపీడీవో ఫణీంద్ర ,జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, నాయకులు ఆచంట శ్రీనివాస్, సూర్య ప్రకాష్ రావు, సిద్ధు, నరేష్ మాజీ జెడ్పిటిసి సభ్యులు ముత్యాల రామారావు తదితరతెదేపా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ,అధికారులు పాల్గొన్నారు

## కోయ (గోండి) భాషాకు అధికారిక గుర్తింపు ఇవ్వాలి..... ఆదివాసిసంక్షేమ పరిషత్తు- ఏ యు ఎస్ పి



ఎటపాక **జూలై 21 జనం రిపోర్టర్ :** తేది :21 -07 -2024 న ఆదివారం నాడు ప్రపంచ కోయ భాషా దినోత్సవం సందర్భంగా విశ్వ కోయ (గోండి) భాషా దినోత్సవాన్ని ఆశ్రమ ఉన్నత పాఠశాల కొత్తూరు నారాయణపురం ఎటపాక మండలం నందు ఆదివాసి సంక్షేమ పరిషత్ మరియు దాని అనుబంధ సంఘాలైన ఆదివాసి టీచర్స్ అసోసియేషన్, ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ మాట్లాడుతూ అంతరించి పోతున్న భాషలో కోయ భాష ఒకటి అని, దాన్ని పరిరక్షించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు,ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయినా యునెస్కో 2019 న విశ్వ కోయ( గొండి ) భాషాలను పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని తీర్మాన్నించడం జరిగింది. అప్పటినుండి సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జూలై 21న, ప్రతి గ్రామంలో కోయ భాష దినోత్సవాలు జరుపుతున్నాం. అలాగే కోయ భాషా పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా గుర్తించి, 8వ షెడ్యూల్లో చేర్చే కోయ భాషాను పరిరక్షించాలని ప్రభుత్వాలను కోరారు. ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను మాట్లాడుతూ ఆదివాసీల కోయ భాషా చాలా పురాతనమైనదని ,భారత దేశంలో 8 రాష్ట్రాల్లో కోయ భాషా ను మాట్లాడుతున్నారని ,కోయ భాష కు లిపి లేని కారణంగా అంతరించి పోయే భాషలో కోయ భాషా ఒకటిగా ఉంది. తెలుగు భాష పరిరక్షణకు ప్రభుత్వాలు ఏ విధంగా కృషి చేస్తున్నాయో అదే విధంగా కోయ భాష పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వాలను కోరారు. తదనా%శీ%తరం కోయ భాషా సాహిత్యం ,పద్యాలు ,పాటలు, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నూప వారి ఫౌండేషన్ ద్వారా బహుమతులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు నూఫ అనిల్, ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు తోడెం దేశయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామల శంకరయ్య , ఉపాధ్యాయులు సవలం కన్నారావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలవరం కాలువ రోడ్డుపై గతుకుల రోడ్డులో ప్రమాదం సంభవించింది. పలువురికి గాయాలు.



కాకినాడ జిల్లా, జగ్గంపేట, **జూలై 21 జనం రిపోర్టర్ :** జగ్గంపేట గోకవరం రోడ్డులోని పోలవరం కాలవపై ఉన్న వంతెన వద్ద గతుకులలో పడి పలువురికి గాయాలు.గోకవరం నుండి జగ్గంపేట వైపు వస్తున్న రెండు బైకులు పోలవరం కాలువ బ్రిడ్జిపై ఉన్న గతుకులు లో పడి ప్రమాదం సంభవించింది. రెండు బైకులు పై ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి.. కనీసం చిన్న చిన్న గోతులను మరమ్మత్తులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని అధికారులపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే స్వచ్ఛందంగా చాలామంది ఆ గోతుల్లో మట్టి వేసిన ఫలితం లేదు.. సంబంధిత అధికారులు తక్షణం చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపి గోతుల మార్గాన్ని నయం చేయాలని పలువురు కోరుతున్నారు..

## శ్రీజగదంబతల్లి ట్రాలీ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ




వేలేరుపాడు **జూలై 21 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలానికి చెందిన శ్రీ జగదంబ తల్లి ట్రావెల్ ఆటో ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలేరుపాడు ముంపు నిర్వాసితులకు ఆహార పొట్లాలు, బిస్కెట్లు,రొట్టెలు, మంచినీరు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు



గెడ్డం జనార్ధన్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, ట్రెజరీ దారా మనోజ్ , సీనియర్ కార్యవర్గ సభ్యులు మద్రి జాను మోజేష్ పుల్లారావు, పిట్ట సుందర్ రావు బేతంపూడి రవీంద్ర, గుడ్ల రాంబాబు,సునీల్ కుమార్ శ్రీను,తదితరులు పాల్గొన్నారు అలాగే ఈ కార్యక్రమం లో యూనియన్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు అలాగే రానున్న రోజుల్లో ఇంకా మంచి మంచి కార్యక్రమాలు యూనియన్ తరపున చేయాలని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారు

## డ్వాక్రా యానిమేటర్స్ సమస్యలపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వినతిపత్రం



కాకినాడ జిల్లా, జగ్గంపేట, **జూలై 21 జనం రిపోర్టర్ :** స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట నియోజకవర్గం డ్వాక్రా ఆనిమేటర్స్ అందరూ జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాల పరిమితి గల సర్క్యులర్ ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పదిలక్షల వరకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మాకు రావలసిన బకాయి వేతనాలు చెల్లించాలని, మా ఉద్యోగస్తులను అక్రమంగా తొలగించవద్దని, రాజకీయ వేధింపులు కూడా ఆపాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వినతి పత్రం అందజేశామని దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి మీ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల అధ్యక్షరాలు ఈశ్వరి, గోకవరం మండల అధ్యక్షురాలు ప్రమీల, గండేపల్లి మండల అధ్యక్షురాలు అమ్మాణి కిర్లంపూడి మండల అధ్యక్షురాలు మేరీ నాలుగు మండలాల యానిమేటర్స్ పాల్గొన్నారు.

## ఇల్లందు జిఎం ఆఫీస్ ముందు సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ధర్నా....



రామగుండం **జూలై 21 జనం రిపోర్టర్ :** సింగరేణి బ్లాకులను వేలం నుండి ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు,ఆదివారం ఇల్లందు డివిజన్ సింగరే ణి కాలరీస్ జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సీనియర్ ఆఫీసర్ టూ జిఎం కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నాకు టిజిఎల్బికెఎస్, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌని.నాగేశ్వర్ రావు అధ్యక్షత వహించగా, ఐక్యవేదిక నాయకులు ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ , టిఎస్యుఎస్ నుండీ కామేరా.గట్టయ్య, ఎఐఎఫ్టియు నుండి జి. రాములు,ఐఎఫ్టియు నుండి రాడొద్దీన్ లు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు.ఈ ధర్నా కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఈ.నరేష్, డి.ప్రసాద్,నీరేటీ. రాజన్న, పోచామల్లు,సారంగపాణి, నాగేశ్వర్ రావు, మల్లికార్జున్. తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖమంత్రి.లి



ములుగుజి **జూలై 21 జనం రిపోర్టర్ :** ములుగు మండలం లోని జాకారం గట్టమ్మ దేవాలయం మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను మరియు అక్కడి వరుద ఉదృతిని పరిశీలించిన మంత్రి డాక్టర్ సీతక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాతీయ రహదారి పై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలకు రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలనిఅన్నారు ములుగు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ఉన్నందున ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు ఎవ్వరూ రావద్దని ముఖ్యంగా వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి ఎవ్వరూ కూడా చాపల వేటకు వెళ్లవద్దని జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది లోతట్టు ప్రాంతాల లో ఉన్న ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించి విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి సీతక్క సూచించారు

## ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోమంటారు ఎందుకో తెలుసుకుందాం



వికారాబాద్ **జూలై 21 జనం రిపోర్టర్ :** సీతాదేవి లంకలోని అశోకవనంలో తాను ఉన్నంత కాలం ప్రతి రోజు తన కష్టాలను గోరింటాకు చెట్టుతో చెప్పుకునేదట. రావణసంహారం అనంతరం అయోధ్యకు తిరిగి సీతాదేవి వెళ్లేటప్పుడు ఈ గోరింటాకు చెట్టుకు తాను ఏదైనా చేయాలని అనుకున్నదట. ఇందులో భాగంగానే సీతమ్మ గోరింటాకు చెట్టును వరం కోరుకోమంది. దానికి గోరింటాకు చెట్టు మాత్రం తనకు ఎలాంటి వరాలొద్దని చెప్పింది. ప్రస్తుతం నీ మోము ఎలా సంతోషంతో కళకళలాడుతుందో సీతమ్మలాగానే లోకంలోని మహిళలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించిందట. అందుకు గోరింటాకు చెట్టు నిజాయితీకి సీతాదేవి మెచ్చి.. గోరింటాకు చెట్టుకు ఓ వరం ఇచ్చింది. అది ఇకపై స్త్రీ సౌభాగ్యం చిహ్నంగా ఈ గోరింటాకు మానవలోకంలో ప్రసిద్ధి చెందుతుంది. తనవర్ణం వలన చేతులకు, కాళ్లకూ అందాన్నిచ్చే అలంకార వస్తువుగా వాడబడుతుంది. ముఖ్యంగా ఆషాడమాసంలో ఈ గోరింటాకు పెట్టుకోవడం వలన శ్రీ మహాలక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని అదే ఈచెట్టుజన్మకు సార్ధకత అని చెప్పిందట. అలాగే అందరూ గోరింటాకుచెట్టు ఆకుల పసరుతో చేతులు కాళ్లూ అందంగా తీర్చుకుంటు ఉంటారు అని వరం ఇచ్చింది. ఆసమయంలో కుంకుమకు సందేహం కలుగుతుంది. నుదుటన కూడా ఈ ఆకు వలన బొట్టు దిద్దుకుంటారేమో?అప్పుడు నా ప్రాధాన్యత తగ్గిపోతుందేమోనని సీతమ్మతో ఆ సందేహం చెప్పగా నుదుటన గోరింటాకు పండదు అంటుంది.

### కావాలంటే చూడండీ గోరింటాకు నుదుటన పండదు

పెద్దోళ్ళు ఏంచెప్పినా దూరదృష్టితోనే చెబుతారండీ. గోరింటాకు చెట్టును ఆషాడమాసంలో ఎవరు ప్రార్థిస్తారో వారి చేతుల్లో గోరింటాకు పెట్టుకుంటారో వారికి సకలసంపదలు, సుఖసంతోషాలు చేకూరుతాయి. వారి జీవితం సంతోషకరంగా ఉంటుందని చెప్తుంది. అందుకే ఆషాడ మాసంలో గోరింటాకును మహాలక్ష్మీదేవిని ధ్యానించి చేతులు పండేంతగా పెట్టుకుంటే మహిళలకు ఎలాంటి కష్టాలుండవని శ్రీ మహాలక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని పురాణాలు చెప్తున్నాయి. “ఆషాడమాసం” లో చేతులకు గోరింట పెట్టుకోవడం ఒక ఆచారంగా మన సమాజంలో స్థిరపడింది. అలంకరణలో భాగమని భావించినా, దీని వెనుక ఎన్నో ప్రత్యేకతలు దాగి ఉన్నాయి. గోరింటాకు మహిళల చేతులకూ, పాదాలకూ అందాన్ని రెట్టింపు చేస్తుంది. ఇదేదో అలంకరణ కోసం తెచ్చిన ఆడంబరం కాదు. గోరింటాకు పెట్టుకోవడం వెనుక ఎన్నో ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఆషాఢ మాసంలో వాతావరణ ప్రభావం వల్ల అనేక సూక్ష్మ క్రిములు వ్యాపిస్తూ ఉంటాయి. వానల రాకతో గాలిలో, నీటిలో వీటి శాతం ఎక్కువగా ఉంటుంది. తేమలో ఉండే సూక్ష్మ క్రిముల ప్రభావం చేతులు ద్వారా, పాదాల ద్వారా చర్మరంధ్రాల గుండా శరీరంలో ప్రవేశించకుండా గోరింటాకు కవచంగా పనిచేస్తుంది. గోరింటాకు ఒత్తిడిని, వేడిని తగ్గిస్తుంది. స్త్రీ అరచేతి మధ్యలో గర్భాశయానికి రక్తం చేరవేసే ప్రధాన నాడులు ఉంటాయి. గోరింటాకు ఆ నాడుల్లో ఏర్పడే అతి ఉష్ణాన్ని లాగేస్తుందని, తద్వారా గర్భాశయ దోషాలు తొలగిపోతాయని చెబుతున్నది ఆయుర్వేదం.

# బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది.....

## పాలకుర్తి మండలం లో వేమునూరు, కుక్కల గూడూరు ,తక్కలపల్లి, పాలకుర్తి మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా... - ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్...



రామగుండం **జూలై 21 జనం రిపోర్టర్ :**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలను వివరించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ గారులి పాలకుర్తి మండలం లో నెలకొన్న ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, అనే సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ అన్నారు. ఆదివారం పాలకుర్తి మండలం లో పరిధిలో వేమునూరు, కుక్కల గూడూరు, విశాల తక్కలపల్లి, గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యామని ఎటువంటి అవినీతి లేకుండా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ఈ ప్రభుత్వం తీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమలు చేసిన రైతు రుణమాఫీ పథకం రైతులకు ఏ విధంగా అందాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు వివరించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమ అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వం దేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తుందన్నారు. రానున్న రోజుల్లో రామగుండం నియోజకవర్గం ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ నాయకులు, వివిధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరం సత్యనారాయణ స్వామి మహా వ్రతం లో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు



కాకినాడ జిల్లా ,అన్నవరం, జగ్గంపేట, **జూలై 21 జనం రిపోర్టర్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానంలో మైసూరు కు చెందిన అవధూత దత్త మణి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం సత్యనారాయణ స్వామి వారి మహావ్రతాన్ని రెండు రోజులపాటు విశేష పూజలు, ఆవాహనాలు అర్చనలతో 116 మంది బ్రాహ్మణోత్ములతో నిర్వహించారు. గురు పౌర్ణమి రోజున జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ జగ్గంపేట కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ చైర్మన్ జ్యోతుల మణి దంపతులు, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి హాజరై మహా వ్రతంలో పాలుపంచుకున్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని సత్యనారాయణ స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం రిటైర్డ్ పిఆర్ఓ తులా రాముడు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి.... -పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ...




రామగుండం **జూలై 21 జనం రిపోర్టర్ :** పెద్దపల్లి డివిజన్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఎవరు బయటకు రావద్దని ఏసిపి జి కృష్ణ అన్నారు. ఆదివారం సిఐ ఆర్.కృష్ణ, బసంనగర్ పెద్దపల్లి ఎస్ఐలతో కలిసి సబ్బితం (గౌరిగుండాల జలపాతం) ,పెద్దబొంకూర్ దస్తగిరి పల్లి కొత్తపల్లి లోని లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. నిరంతర వర్షపాతం కారణంగా జలపాతాన్ని సందర్శించకుండా వార్న్‌ఫ్లెక్సీలు , బారికేడ్లుఏర్పాటు చేయడం జరిగిందని ఏసిపి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎసీపీ మాట్లాడుతూ. అవసరమైతే తప్ప ఎవరు బయటకు రాకూడదని, చాపలు పట్టడానికి వెళ్లకూడదని, అదే విధంగా తడిగా ఉన్న కరెంటు స్తంభాలని ముట్టుకోకూడదని, వాటర్ ఫాల్స్ సందర్శకులు ఎవరు కూడా ఈ సమయంలో బయటికి రాకూడదని అన్నారు. ఏదైనా ఆపద సంభవిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 100 కి కాల్ చేయాలని ఎసీపీ తెలిపారు.

## యోగ గురువులు సీతారాం, అశ్విని లకు ఘన సత్కారం



ఎన్టీఆర్ జిల్లా, నందిగామ,**జూలై 21 జనం రిపోర్టర్ :** నందిగామ పట్టణంలో గురు పౌర్ణమి సందర్భంగా యూనివర్సల్ యోగ సెంటర్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు జడ్పీహెచ్ హైస్కూల్లో ఉచిత యోగా తరగతులు నిర్వహించిన సందర్భంగా యోగా గురువులు గాడిపర్తి సీతారాం, కన్నేటి అశ్విని ని నందిగామ చందర్లపాడు రోడ్ లో గల ఫ్లేవర్స్ హెూటల్ హాల్ నందు ఘనంగా శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా యోగా గురించి గాడిపర్తి సీతారాం మాట్లాడుతూ ప్రాణామాయం, యోగ, సుదర్శన క్రియ ద్వారా ప్రతి ఒక్కరూ రోగాల నుండి విముక్తి పొందవచ్చని అన్నారు. యోగ భోధించిన విధంగా ప్రతి ఒక్కరూ సేవా భావం పెంపొందించుకోవాలని అన్నారు. యోగా ద్వారా ఒత్తిడిలేని ఆనందమైన జీవితాన్ని పొందవచ్చని అన్నారు.యోగ గురూజీ కన్నేటి అశ్విని మాట్లాడుతూ యోగ అనేది ఒక మనసును ఆత్మను శరీరాన్ని ఏకం చేసే ఒక మహెూన్నత సాధనం అని యోగా ద్వారా ఒత్తిడిలేని ప్రశాంతమైన, ఆనందమైన జీవితం గడపవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో నందిగామ మీడియా మిత్రులు, ప్రముఖులు, యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన ముద్వా విజయ్ బాబు. మర్యాదపూర్వకంగా కలిసిన నవాబుపేట మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్..!!



వికారాబాద్. **జూలై 21 జనం రిపోర్టర్ :** తెలంగాణ నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గా ముద్వా విజయ్ బాబు ను మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది హైదరాబాదులోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్చం తోపాటు శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన నవాబు పేట్ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్,చేవెళ్ల నియోజకవర్గం అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భానూరి ఉపేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయికుమార్ బొడ్డు శ్రీనివాసరెడ్డి వై మహేందర్ రెడ్డి తదితరులు కలిసి. శుభాకాంక్షలు తెలియజేశారు.

### -కోడిపుంజుల జ్యోతి పి.ఓ.డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు...



రామగుండం జూలై 21 జనం రిపోర్టర్ : ఆదివారం అంతర్గాం మండల కేంద్రంలోని సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో "ప్రగతిశీల మహిళా సంఘం" మండల అధ్యక్షులు కొల్లూరి అమృత అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఈ జనరల్ బాడీ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి ముఖ్య వ్యక్తగా హాజరై మాట్లాడుతూ.కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళకు రక్షణ కరువైందని, లైంగిక వేధింపులు, హత్యలు, హత్యాచారాలు, గృహ హింస మరింత పెరిగాయని, స్త్రీ పురుష సమానత్వం కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమబాగం కోసం గత అర్ధ శతాబ్దంలో పి.ఓ.డబ్ల్యూ అనేక పోరాటాలు నిర్వహించిందని, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టాల కోసం వాటి అమలు కోసం పి.ఓ.డబ్లు బలమైన పోరాటాలు చేసిందని తెలియజేశారు. పేరుకు మహిళలకు 33 శాతం పార్లమెంటులో చట్టం చేసిన అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం వచ్చాక స్త్రీలపై హింస, మతోన్మాదం పెరిగిపోయిందని, మహిళా మల్లాయోధుల పై బిజెపి ఎంపీ "బ్రీజ్ భూషణ్" వేధింపులకు పాల్పడ్డారని, లైంగిక వేధింపుల చట్టం ఉన్నప్పటికీ అతనిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని, ఆ చట్ట అమలు కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బిల్కిస్ భానుపై సామూహిక హత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని విడుదల చేసి పరోక్షంగా బిజెపి పార్టీ సన్మానించిందని విమర్శించారు. మరొకవైపున భారత రాజ్యాంగ విరుద్ధంగా సి.ఏ.ఏ, ఎన్.ఆర్.సి, పౌర చట్టాలను తీసుకువచ్చి మత ఉన్మాదంతో వ్యవహరించిందని, ఒకే దేశం, ఒకే మతం, ఒకే జాతి పేరుతో భిన్నజాతుల, మతాల సమూహారమైన భారత జాతీయతకు స్ఫూర్తికి భిన్నంగా బిజెపి పార్టీ వ్యవహరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి మహిళలపై మనువాదన్ని ఒక్కొక్కటిగా వారి హక్కులను హరిస్తూ అణిచివేస్తుందని దుయ్యబట్టారు, పిత్రు స్వామిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూనే నేడు తమ హక్కుల కోసం, భూమి కోసం, ఈ దేశ విముక్తి కోసం పోరాడాల్సిన అవసరం ఉందని, అలాగే ఈనెల 28వ తారీఖున గోదావరిఖని ఐఎఫ్టియు ఆఫీసులో జరిగే "జిల్లా మహాసభ" ను అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పి.ఓ. డబ్ల్యు నూతన మండల కమిటీ ఈక్రింది విధంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కొల్లూరి. అమృత బ్రాహ్మణపల్లి, ఉపాధ్యక్షులుగా బి. కమలక్క అంతర్గాం టి.టి.ఎస్, ప్రధాన కార్యదర్శిగా కోడిపుంజుల. స్వప్న పెద్దంపేట్, సహాయ కార్యదర్శిగా లింగంపల్లి. పద్మ మద్దిర్యాల, కోశాధికారిగా వేల్పుల. ఉమక్క పొట్యాల, కార్యవర్గ సభ్యులుగా కోడిపుంజుల. సత్తక్క, పైడిపల్లి. అమృతమ్మ పెద్దంపేట్, సమ్మెట. మంజుల రామగుండం, బొంతు. సరస్వతి అంతర్గాం మొత్తం 9 మందితో కమిటీ వేయడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు జి. రమాదేవి, ఆలకుంట. పద్మ, మల్లమ్మ, పి. కవిత, యం. భారతి, కె. స్వప్న, బి. ప్రమీల, బి. పద్మ, బి. మాధురి, బి. శ్యామల, బి. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల సంధార్బంగా ప్రజలు అత్యవసర సమయం లో డైల్ 100కు గాని పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 70056 కు గాని సంప్రదించండి..!!

### వికారాబాద్. జిల్లాఎస్పీ కే.నారాయణ రెడ్డి, ఐపీఎస్..!!



వికారాబాద్. **జూలై 21 జనం రిపోర్టర్ :** తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లా పరిధిలోని పలు గ్రామాలలో భారీ వర్షం పడుతున్న శుభ సందర్భంగా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, వర్షాకాలం లో పలు జాగ్రతలు పాటించాలని జిల్లా ఎస్పీ సలహాలు సూచనలు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీతెలియజేసిన సలహాలు సూచనలు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటం తో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగాఉండాలి. కరెంటు స్తంభాలను, ట్రాన్స్ఫరమ్స్ ను ముట్టుకోవద్దు మరియుచిన్నపిల్లలను వాటి నుండి దూరంగా ఉంచాలి.ముఖ్యంగా గ్రామాలలో పంట పొలాల దగ్గర రైతులు జాగ్రతగా వుండాలని సూచించారు. చాలాసంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకున్న పాడుపడ్డ ఇండ్లల్లో ఉండకూడదని, వర్షానికి గోడలు నాని కూలి, ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది,అలాగే పాడు పడ్డ బావులు, చుట్టూ కంచె లేని బావుల దగ్గరకు వెళ్లకుండా జాగ్రతగా ఉండాలని తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాలకు వెళ్లాలంటే వాగులు వంతెనలు దాటవలసి వుంటుంది కావునా ప్రజలు వరద ఉధృతిని గమనించి దాటలని, దాటుటకు అవకాశం లేనిచో పోలీసు అధికారులకు గాని ఇతర అధికారులకుగాని సమాచారం అందించాలని, వీలైతే వాగుకు ఇరువైపులా రహదారిపై కంచె వేసి తోటి ప్రయాణికులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈదురు గాలులకు కరంట్ స్తంబాలు,చెట్లు విరిగి రోడ్లపై పడే అవకాశం వుంటుందని వర్షంతో రోడ్లు పూర్తిగా తడిసి ఉంటాయి మరియు రోడ్లపై అక్కడక్కడ వున్న చిన్న చిన్న గుంటలు నీటితో నిండి వుంటాయి కావునా ప్రమాదలకు గురి అయ్యే అవకాశాలు ఉన్నందున వాహన దారులు జాగ్రత్తగా గమ్యం చేరాలని సూచించారు.భారీ వర్షాల కారణంగా గ్రామాలకు వెళ్ళే రోడ్లు గాని, రహదారులు గాని, పొలాలకి వెళ్ళే బాటలు కొట్టుకొనిపోయే అవకాశం ఉంది. కావునా ఎక్కడైనా రోడ్లు, వంతెనలు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినా పోలీస్ అధికారులకు, సంబందిత అధికారులకు తెలపాలని, వర్షాల వలన చెరువులు, కుంటలు, వాగులు నీటితో నిండి ఉప్పొంగుతుంటాయి, వాగులు ప్రమాద స్థాయిలో పరుగులు పెడుతున్న సమయం లో ఎట్టి పరిస్థితుల్లో వాగులు దాటే ప్రయత్నం చేయకూడదు. భారీ వర్షాల వలన ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లు అయితే ప్రజలు తమ పరిధి లోని పోలీస్ స్టేషన్ అధికారులకు గాని డైల్ 100 కు గాని,జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 70056 కు గాని లేదా సంబంధిత అధికారులకు గాని ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పి తెలిపినారు.జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూ, జిల్లా ప్రజల సంక్షేమం లో కూడా పోలీస్ అధికారులు ఎల్లపుడూ ముందు వరసలో ఉంటారని జిల్లా ఎస్పి కే.నారాయణ రెడ్డి, ఐపీఎస్ తెలిపారు.

## అంతర్గాం మండల కేంద్రంలో ప్రజల సమస్యల పైన పర్యటించిన మక్కన్ సింగ్ రాజు ఠాగూర్ .....



రామగుండం **జూలై 21 జనం రిపోర్టర్ :**తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ప్రక్రియతో సోని అమ్మ తెలంగాణ ఇవ్వడం జరిగింది, కానీ గత ప్రభుత్వం ఏడు లక్షల అప్పు చేసి నిత్తితో కలిపి పది లక్షలు అప్పు చేసిన ప్రభుత్వం గత ప్రభుత్వం అని ,కానీ ఇప్పుడు మన ప్రజలు దొరల గడిపాలన బద్దలు కొట్టి ఇచ్చిన తెలంగాణ తెచ్చుకోవడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన గ్యారెంటీలలో ఇప్పటివరకు ఐదు గ్యారంటీలు పూర్తి చేసుకోవడం జరిగింది. దానిలో మహిళలకు ఫ్రీ బస్సు, ఇందిరమ్మ ఇండ్లు ,రైతులకు రుణమాఫీ చేసిన ఘనత అది కాంగ్రెస్ పార్టీ దేనాని, గత ప్రభుత్వం టిఆర్ఎస్ బిజెపి రైతులకు కంటి నీరు తెచ్చిపెట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 15 లోపే కాకుండా రైతులను దృష్టిలో పెట్టుకొని, రైతుల పంటలకు ఇబ్బంది కలవకుండా ఆరు నెలల ముందే పదివేల కోట్లు రైతుల రుణమా మాపి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఒకే రోజు సుమారు 7 వేల కోట్లు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనిని ,మరో వారం రోజులలో రెండో విడత లక్ష యాభై వేల రుణమాఫీ, అదేవిధంగా మూడో విడత రెండు లక్షల రుణమాఫీ కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోతుందని, భారత దేశంలో ఇతర రాష్ట్రాలు తెలంగాణను ఒక మాడల్ దేశంగా ఆదర్శంగా తీసుకునే విధంగా గర్వించదగ్గ విషయమని, 72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని ఇకమీదట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామాలలో తిరుగుతూ మీ సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందని, మీకు ఎవరికైనా రుణమాఫీ కాకపోయినట్టయితే ,మా నాయకులకు గాని మాకు కానీ చెబితే వాటిని పరిశీలించి రుణమాఫీ చేసే దిశగా వెళదామని, మరి కొద్ది రోజులలో లబ్ధిదారులైనటువంటి ఇంద్రమ్మ లను కూడా ఇవ్వడం జరుగుతుందని ,అలాగే బర్మా కాందిషకులకు కూడా త్వరలోనే కంపెనీలో పనిచేసిన కార్మికులకు నాలుగు లేదా ఐదు గుంటల భూమిని ఇప్పిస్తానని తెలుపుతూ, అంతర్గాం మండల ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తక్షణమే ఆ సమస్యను పరిష్కారం చేయడం కోసం ఎప్పటికీ మీ వెంటే ఉంటానని, మీ మధ్య ఉంటానని రామగుండం



శాసనసభ్యులు రాజు ఠాగూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెంద్రు హనుమాన్ రెడ్డి ,అధికార ప్రతినిధి మడ్డి తిరుపతి గౌడ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మల్లెపు స్వామి ,మురుమూరు తాజా మాజీ ఎంపీటీసీ కొక్కెర రమేష్ యాదవ్ ,మాజీ సర్పంచ్ తమ్మన వేణి కొమురెల్లి యాదవ్, గుంట బాపు గుంట లక్ష్మణ్ ,మాజీ ఎంపీపీ ఆవుల గోపాల్ యాదవ్ ,మాజీ ఎంపీపీ కొదురుపాక పవన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామారావు, గజ్జల నాగరాజ్, అంగోత్ సూరి నాయక్ పెద్దపెల్లి జిల్లా ప్రచార కార్యదర్శి జూల లింగయ్య, మురుమూరు గ్రామ అధ్యక్షులు గొర్రె చందు, ఎన్ ఎస్ యు ఐ అంతర్గాం మండల నాయకులు దార వేణి ప్రశాంత్ యాదవ్ ,అంజయ్య గౌడ్ ,బూరుగు రవి గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నక్క రాజ్ కుమార్, అప్పల రాజేందర్, తమ్మనవేని ప్రశాంత్ యాదవ్ ,అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న ఆధ్వర్యంలో గోదావరిఖనిలో నిర్వహించిన రైతు సదస్సు....

### రైతు సదస్సు కు అధ్యక్షతన వహించిన సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్....



రామగుండం **జూలై 21 జనం రిపోర్టర్ :** తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న ఆధ్వర్యంలో గోదావరిఖనిలో నిర్వహించిన, రైతు సదస్సు కు సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఓ, యు ప్రొఫెసర్ కాసిం హాజరై మాట్లాడుతూ. రైతులు భూమి నుండి తొలగిపోయేలా మొదటి నుండి ప్రత్యేకంగా ప్రయత్నాలు జరిగాయని భూమి మీద సంపద మీద పెత్తనం వహిండం కోసం సామ్రాజ్య వాదులు ఎత్తులు వేయడం లో భాగంగానే,ప్రపంచ వాణిజ్య సంస్థ లాంటి సంస్థలు ఏర్పాటు కాబడ్డాయని అన్నారు .తెలంగాణ ఉద్యమకారులు భారత్ బచావో వ్యవస్థాపకులు గాదే ఇన్నయ్య , పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడడానికి పాలకులే కారణం అని అన్నారు. దిగుమతులు మీద ఆంక్షలు , ప్రపంచ బ్యాంకు



ఒప్పందం నుండి బయట పడాలని సూచించారు. కార్పొరేట్ సంస్థలకు 16లక్షల కోట్లు మాఫీ చేయకపోవడం ఆ చిన్నపాటి రుణాల విషయంలో పాలకులు తాత్సారం చేయడం సరికాదని అన్నారు. మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తిరుపతయ్య మద్దతు ధర అమలు అంశం పై ప్రసంగించారు. ఈ కార్ర్యమంలో దళిత లిబరేషన్ ఫ్రెండ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ , కవి రచయిత ఏలేశ్వరం వెంకటేశ్వర్లు , దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజా రత్నం , టీజేఏసీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకట మల్లయ్య, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా బాధ్యులు గంగారెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి, శ్రీపతి గోపాల్ , ప్రజా ఫ్రంట్ నాయకులు గాండ్ల మల్లేశం, కొమురయ్య, విప్లవ రచయితల సంఘం నాయకులు బాలస్వామి రాజయ్య , సామాజిక నాయకులు ఎరుకల రాజన్న, ఏఐటీయూసీ మద్దెల దినేష్, రమేష్ సమతా సైనిక దళ్ నాయకులు చీదురు వసంతరావు, చీమల ఆనంద్, ఛందనగిరి శివ ప్రసాద్, దూట రాజు, రైతులు, కార్మికులు, కర్షకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ దేవీ భూదేవీ సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారికి నవ కలశ సహిత తిరుక్కల్యాణ మహెూత్సవం



రాజవొమ్మంగి, **జూలై 21 జనం రిపోర్టర్ :** అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి లో వేంచేసి యున్న శ్రీ శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ కళ్యాణ వేంటేశ్వరస్వామి వారికి సోమవారం శ్రవణా నక్షత్రశుభ లగ్నమందు నవ కలశ అభిషేకము తిరువారాధన మరియు తిరుక్కల్యాణ మహెూత్సవం అత్యంత వైభవంగా జరుపబడునని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు శ్రీవారికి విశిష్ట సేవలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు తీర్థ ప్రసాద గోష్ఠి,శ్రీ వారి కల్యాణోత్సవం అక్షతలు పంపిణీ చేయబడుతుందని,మధ్నాహ్నం 12 గంటలు నుండి అన్నదానం జరుపబడునని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు ఈకార్యక్రమాల్లో భక్తులందరూ శ్రీవారి సేవల్లో పాల్గొని తదు అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కమిటీ వారు కోరారు స్వామివారికి సోమవారం తెల్లవారుజాము నుండి విశేష ద్రవ్యాలు తో అభిషేకములు జరుపబడునని ఈ కార్యక్రమంలో భక్తులు అభిషేకముల కొరకు పూజా సామాగ్రి తెచ్చుకోవచ్చని తెలిపారు కల్యాణం చూడడానికి వచ్చేవారు కూడా తగిన పూజా సామాగ్రిలు తెచ్చుకొన వచ్చునని ఆలయ అర్చకులు కమిటీ సభ్యులు తెలిపారు

# తెలంగాణసర్కారు మారిన సరికాని రోడ్లు

## -అధ్వానంగా మారిన నవాబుపేట్ మండల్ పలు గ్రామాలలో రోడ్లు..!!

## -తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు. గ్రామాల ప్రజలు




వికారాబాద్. జూలై 21 జనం రిపోర్టర్ : నవాబు పేట్ మండలంలోని పలు గ్రామాలలో భేట రోడ్లు అద్వారంగా మారాయి. గుంతలు ఏర్పడ్డాయని ఇది వర్షాకాలం కావడంతో ఆ గుంతలలో నీళ్లు నిండి ఇంకా రోడ్డు పాడైపోయిందని దీనివలన ముఖ్యంగా ఆ మార్గం లో ప్రయాణించే చిట్టి గడ్డ నవాబుపేట్ ఎల్లకొండ గుండ్లగూడ , పలు గ్రామాలకు చెందిన వాహనదారులు తీవ్ర అలాగే ప్రజలు




ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు ఈ రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా ఇలాగే ఉందని గత ప్రభుత్వ నాయకులకు చెప్పిన పట్టించుకోలేదని వారు తెలిపారు ఇప్పటికే ఇందుకు సంబంధి ంచిన అధికారులను వారు సంప్రదించామని తెలిపారు.




కనీసం ఈ ప్రభుత్వంలో అయినా రోడ్డు మరమ్మతు పనులు సత్వరంగా పూర్తి చేసి తమని ఈ ఇబ్బంది నుంచి బయటపడేయాలని ఆయా గ్రామాల ప్రజలు వాన దారులు వారు కోరడం జరిగింది.

# సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలు.




రంగారెడ్డి జిల్లా, శేర్లింగంపల్లి మండలం, జూలై 21 జనం రిపోర్టర్ : హైదరాబాద్ సిటీ: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసులును సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు, సెంట్రలైజ్‌డ్ కాల్‌డాటా అనాలసిస్‌లో పనిచేస్తున్న పి.సతీష్?ను దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు, దుండిగల్ పోలీస్?స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శంకరయ్యను సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్‌కు, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న కె.ప్రతాప్ లింగంను ఉమన్ సేఫ్టీ వింగ్‌కు, ఉమన్ సేఫ్టీవింగ్‌లో పనిచేస్తున్న ముత్తుయాదవ్‌ను కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, రాజేంద్రనగర్ డీఐ చంద్ర గంగాధర్‌ను బాలానగర్ సీసీఎస్?కు బదిలీ చేశారు. అలాగే... సీసీఎస్ బాలానగర్‌లో పనిచేస్తున్న సీహెచ్ రాజును సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న పి.రాజే ను క్యాట్‌కు, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న ఎస్.విజయ్‌ను రాయదుర్గం డీఐగా, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న ఎస్.కనకయ్యను జీడిమెట్ల డీఐగా, మైలార్‌దేవ్‌పల్లి డీఐగా పనిచేస్తున్న గొల్ల తిమ్మన్నను బాచుపల్లి డీఐగా, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కటకం శ్రీనివాస్‌ను మైలార్‌దేవ్‌పల్లి డీఐగా బదిలీ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు..

# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతిగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు...

## -బిజెపి ప్రభుత్వం గత టిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం తప్ప న్యాయం చేయలేదు...

## -ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ...



రామగుండం జూలై 21 జనం రిపోర్టర్ :అంతర్గాం మండల రైతంగంతోని కలిసి అంతర్గాం టీటీఎస్ లో ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ. 31 వేల కోట్ల రైతులకు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అన్నారు.రైతులపై చట్టని తీసుకొచ్చి ప్రైవేటీకరణ బిజెపి చేస్తుంటే, కింటల్ కి 14 కిలోలు కోత కోసి రైతుల నోట్ల మన్ను పోసిన గత ప్రభుత్వం కే దక్కింది, పంట సమయం దగ్గరకు వచ్చింది రైతులను ఆదుకునే దిశలో ఈరోజు రైతులు రుణమాఫీ ముందస్తుగా లక్ష రూపాయలు రుణమాఫీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమ్ కి, ఐటీ శాఖ మంత్రి దుద్దుల శ్రీధర్ బాబు కి, వివిధ మంత్రివర్యులకు ధన్యవాదాలు రైతుల పక్షాన తెలిపారు. బిజెపి ప్రభుత్వంలో గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు అన్యాయం తప్ప న్యాయం జరగలేదు, అంతర్గం మండలంలో ప్రతి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల నాయకులు వివిధ విభాగాల నాయకులు కార్పొరేషన్ కార్పొరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణిని ఆర్థికంగా దోచుకోవటానికి ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం....

## ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం....



రామగుండం జూలై 21 జనం రిపోర్టర్ : సింగరేణి ని ఆర్థికంగా దోచుకోవడానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇట్టి విధానాన్ని విడనాడాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఆర్థికంగా దోచుకొన్న దానికి ప్రతిఫలంగా కార్మికులు ఎన్నికల్లో బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో వెళ్తూ సింగరేణిని ఆర్థికంగా దోచుకోవడానికి తెరలేపిందని ఆయన విమర్శించారు, దానిలో భాగంగానే శనివారం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పేరుతో సింగరేణి సొమ్మును దోచిపెట్టడానికి కొత్త పథకాన్ని తీసుకొచ్చిందని ఆయన అన్నారు. సింగరేణి సొమ్ము ప్రభుత్వం వాడుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. సింగరేణి అధికారులు వాళ్ల ప్రాబల్యం కోసం సింగరేణి ధనాన్ని అధికారం లో ఉన్న ప్రభుత్వానికి దోచి పెడుతున్నారని ఆయన ఆరోపించారు. సింగరేణి కి చెందిన కోట్లాది రూపాయలు డి.ఎం.ఎఫ్.టి , సి.ఎస్.ఆర్ స్కీం ల పేరు మీద రాష్ట్ర ప్రభుత్వ పథకాల కు సింగరేణి యాజమాన్యం నిధులు మళ్లిస్తుందని ఆయన అన్నారు. కార్మికులు కష్టపడి సంపాదించిన సొమ్మును ప్రభుత్వాలకు ధారా దత్తం చేస్తూ సింగరేణి కార్మికుల కనీస అవసరాలు కూడా తీర్చని యాజమాన్యం చర్యలను గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ గా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సింగరేణికి ప్రభుత్వం నుంచి రావలసిన 29 వేల కోట్ల బకాయిలను తీసుకురావాలని, లాభాల్లో 35% వాట వెంటనే కార్మికులకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రక్తాన్ని చెమటగా మారుస్తూ సింగరేణికి లాభాలు తెస్తున్న కార్మికులు....

## సింగరేణి కార్మికుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం...

## దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ ప్రశ్న..?



రామగుండం జూలై 21 జనం రిపోర్టర్ :సింగరేణి లో రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ , కోట్లాది రూపాయలు లాభాలు తీసుక వస్తున్న సింగరేణి కార్మికుడు చనిపోతే వచ్చే బేనిపిట్స్, ఇన్సూరెన్స్ తప్ప ఒక రూపాయి అదనంగానైన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా అని, మరి ఎవరి సొమ్ము ఎవరి కోసం ఖర్చు పెడుతున్నారని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సింగరేణి సి.ఎస్.ఆర్ నిధులను సింగరేణి ప్రాంత అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సి ఉండగా, ఎక్కడో మనకు సంబంధం లేని ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ సివిల్స్ ప్రిలిమ్స్ పాసై మెయిన్స్ కి ప్రిపేర్ అవుతున్న వారికి ఒక్కొక్కరికి లక్ష ఇస్తే రేపు మన కంపెనీకి వాళ్ళ వల్ల ఉపయోగం ఉన్నదా అని ఆయన ప్రశ్నించారు. సింగరేణి లో ప్రస్తుతం ఉన్న 40000 మంది కార్మికుల్లో రామగుండం ఏరియా , శ్రీరాంపూర్ ఏరియా లో 23000 పైగా కార్మికులు ఉన్నారు కానీ ఇక్కడ ఉన్న కార్మికులకు వైద్యం కోసం హాస్పిటల్ కు వెళితే ఎం.ఆర్.ఐ స్కాన్ లేదని ఆయన అన్నారు. అసలు దాని ఖరీదు ఎంత అంటే కోటి 50 లక్షలు అవుతుందని, సింగరేణి డబ్బుతో కార్మికులకు అవసరానికి ఖర్చు చేయకుండా బయట ఎక్కడో ఖర్చు పెడితే కొన్ని కార్మిక సంఘాలు ఎందుకు మౌనంగా ఉంటున్నట్లు అని ఆయన ప్రశ్నించారు. సింగరేణిలో 25వేల మంది యువ కార్మికులు ఉద్యోగం చేస్తున్నప్పటికీ ని వారి పిల్లల ఆరోగ్యం కోసం రామగుండం ఏరియా హాస్పిటల్లో, మిగతా ఏరియాల్లోని హాస్పిటల్ లలో కనీసం రెగ్యులర్ పిల్లల డాక్టర్లు లేక జ్వరాలతో సతమతమవుతున్నా పట్టించుకునే వారు లేరని ఆయన ఆరోపించారు. అత్యవసరంగా పిల్లల కోసం హైదరాబాదు కి రిఫరల్ చేయడానికి హాస్పిటల్స్ లిస్టులో రెయిన్బో హాస్పిటల్ ను చేర్చాలని ఎన్ని రిప్రెజెంటేషన్లు ఇచ్చినా పట్టించుకునే నాధుడు లేడని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికులు తమ పిల్లల చదువుల కోసం లక్షల రూపాయలు గోదావరిఖని, మంచిర్యాల, కొత్తగూడెం, హైదరాబాద్ ప్రాంతాల్లోని కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలకు లక్షల రూపాయల ఫీజులు కడుతున్నా పట్టించుకోకుండా సీబీఎస్ఇ పేరు మీద స్కూళ్లు ప్రారంభిస్తున్నామని ,కార్మికులను యాజమాన్యం మభ్యపెడుతుందని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికుడు పని చేసే స్థలాల్లో రక్షణ లేక, పనిముట్లలో నాణ్యత లేకుండా ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తుంటె, సింగరేణి కార్మికుల రక్తపు పైసలు ఎవరికి ధారపోస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల బ్రతుకులు బాగా లేవు అంటే ఎవరికో డబ్బులు ఇచ్చి కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇకనైనా కార్మికుల సొమ్మును కార్మికుల బాగు కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర నిధులు లేవా...? లేక సింగరేణి అధికారులు రాష్ట్ర ప్రభుత్వం మెప్పు కోసం చేస్తున్నారా...? సింగరేణి లో గుర్తింపు సంఘానికి కనీసం సమాచారం ఇవ్వకుండా ఐఎన్టీయుసి నాయకులు పెత్తనం చేస్తూ, దగ్గర ఉండి డబ్బులు అందించడాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన తెలిపారు. దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షు లెక్క పనిచేసే కార్మికులకు, కార్మికుల కుటుంబాలకు భరోసా నీ ఇచ్చే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, ఇకనైనా యాజమాన్యం కంపెనీ సొమ్మును దుర్వినియోగం చేయకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏక కాలం లో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే ముద్దం తిరుపతి గౌడ్



చొప్పదండి, జూలై 21 జనం రిపోర్టర్ : నాడు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముక్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో ఏకకాలంలో రైతు రుణమాఫీ చెయ్యడం జరిగింది. ఇప్పుడు మళ్లీ అదే కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి అధ్యక్షతన రైతులకు ఏక కాలం లో రుణమాఫీ చేస్తున్న ఘనత కూడా కాంగ్రెస్ పార్టీ దే.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముద్దం తిరుపతి గౌడ్ మాట్లాడుతు....కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ.గత దొరల పాలనలోని బిఆర్ఎస్ ప్రభుత్వం ఇగ చేస్తాం ఆగజేస్తామని 10 సంవత్సరాలలో రుణమాఫీ చేయకుండా చేసినవారికి మిత్తికి కూడా సరిపోకుండా చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వం ది అని,దేశంలో బిజెపి పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఏ ఒక్క రాష్ట్రంలో కుడా రైతు రుణమాఫీ చేయలేదు .రైతులకు చేసిన రుణమాఫీ ఓర్వలేక బి ఆర్ ఎస్,బిజెపి పార్టీ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారని ఆయన అన్నారు.

# ముదిరాజులను బిసి-ఏ గ్రూపులో తక్షణమే చేర్చ..!!

## తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కి వినతి పత్రం అందజేత..!!



వికారాబాద్. జూలై 21 జనం రిపోర్టర్ : వికారాబాద్:2023 అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అభయ హస్తం మేనిఫెస్టో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో వాగ్దానం చేసిన విధంగా జీవో నెంబర్ 15, 19 ఫిబ్రవరి 2009 పునరుద్ధరణని, ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ డీ గ్రూపు నుండి బీసీ-ఏ గ్రూపు మార్పుకు కట్టుబడి అతి త్వరగా పరిష్కరించాలని కోరుతూ ఆదివారం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు వికారాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో అధిక జనాభాగల ముదిరాజ్ లు సమాజములో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామని అన్నారు. ప్రభుత్వంలోని మంత్రివర్గంలో ముదిరాజులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజుల అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సోసైటీ లిమిటెడ్ ను ఏర్పాటుతో పాటు ప్రతి సంవత్సరానికి రూ? 1000 కోట్ల నిధులు కేటాయించి 75% సబ్సిడీతో సబ్సిడీ పథకాలు చేపట్టాలి. మత్స్య శాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, మత్స్యకారులకు 50 ఏండ్లకే ఆసరా పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన ముదిరాజ్లకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే (2014 ) అనంతరం ముదిరాజ్‌ల జనాభా 60 లక్షల కాగా, నేడు మళ్లీ జనగణన చేపట్టాలని కోరారు. ముదిరాజ్‌ల జనాభా తెలపాలని, ఆ దామాషాలో అన్ని అభివృద్ధి ఫలాలను అందజేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టిముక్క శ్రీనివాస్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్కోడ నర్సింలు,జిల్లా వైస్ ప్రెసిడెంట్ బస్వాపురం రాములు,జిల్లా జాయింట్ సెక్రటరీ సిద్దులూరు కృష్ణ,కోట్ పల్లి మండల జనరల్ సెక్రటరీ మందుల శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది.

## కేంద్రమంత్రి మంత్రి పెమ్మసాని.



పొన్నూరు జూలై 21 జనం రిపోర్టర్ : రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి అనంతరం కట్టెంపూడి అడ్డరోడ్డు వద్ద ఏర్పాటుచేసిన సభలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కి మొదట ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. వైసీపీ నేతలు శవ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతి ఒక్కరు సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు పార్లమెంటును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కేవలం దోపిడి, దౌర్జన్యాలకు పాల్పడటంతో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. మంత్రి పెమ్మసాని సహాయ సహకారాలతో నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. సభలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయులు, వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా కో -కన్వీనర్ గా కలువల సంజీవ్....



రామగుండం జూలై 21 జనం రిపోర్టర్ : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 27వ. డివిజన్ గోదావరిఖని పట్టణం గాంధీ నగర్ కు చెందిన కలువల సంజీవ్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపెల్లి జిల్లా కో -కన్వీనర్ నియామకమయ్యారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. రామగుండం పారిశ్రామిక క్షేత్రంలో కలవల సంజీవ్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముందుండేవారు. అదేవిధంగా గత కొద్ది రోజులుగా దళిత సామాజిక వర్గానికి ఏదైనా మంచి చేయాలనే తలంపుతోనే ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘంలో క్రియాశీలక పాత్రను పోషిస్తున్నారు. కలువల సంజీవ్ సేవలను గుర్తించి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ కుమార్ పెద్దపల్లి జిల్లా అంబేద్కర్ యువజన సంఘం కో -కన్వీనర్ గా నియమించారు. రాష్ట్ర అధ్యక్షుని చేతుల మీదుగా సంజీవ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కలవల సంజీవ్ మాట్లాడుతూ. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ కుమార్, యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ లంక సదయ్య,నాయకులు మైస రాజేష్, కొంకటి లక్ష్మణ్, కాంపల్లి సతీష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకు తన వంతుగా కృషి చేస్తానని సంజీవ్ హామీ ఇచ్చారు.

# మీడియా రంగానికి తీరని లోటు కూనపాపారావు



శ్రీకాకుళం రూరల్ జూలై 21 జనం రిపోర్టర్ : మండలం ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని ఉన్న ఆరో వార్డు సప్త పుర కె.మన్నయ్య పేట గ్రామంలో జన్మించారు. కొన్నాళ్ల తర్వాత వివాహ అయిన తర్వాత భార్య ఉద్యోగరీత్యా తో పాలకొండలో సహ జీవనం చేశారు. అక్కడ ఆంధ్రప్రభ పత్రిక లో విలేకరి గా పనిచేశారు .అక్కడ నుంచి బార్య విధులు నిర్వహించిన ట్రాన్స్ఫర్ మేరకు శ్రీకాకుళం లో నివసించుతురు ఈయనకు ఇద్దరు పిల్లలు కలరు. కుమారుడు ఆమెరికాలో ఉద్యోగరీత్యా లో చేరాడు . కూతురికి ఈ మద్య కాలం లో వివాహం చేసితిరి. అలాగే పత్రికా రంగంలో ప్రభుత్వానికి ప్రజలకు వారదుల సేవలందిస్తూ అంచలంచలుగా ఎదుగుతూ సీనియర్ జర్నలిస్ట్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏపీయూ డబ్ల్యూజే యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు, అందర్నీ కలుపుకుంటూ జర్నలిజానికి మంచి సేవలందించి, ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన మిత్రుడు, శ్రేయోభిలాషి కూన పాపారావు అకాల మరణం జర్నలిస్టులకు తీవ్రమైన లోటు... బాధాకరం తెలియజేస్తూ ఆయన మరణానికి చింతిస్తూ ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ఫ్రెంట్ ఎలక్ట్రాన్ మీడియా తరుపున భగవంతుని కోరుకుంటున్నాను.

# స్త్రీనిధి బ్యాంకు మహిళల జీవనోపాదులకు భరోసా



ఆమదాలవలస. జూలై 21 జనం రిపోర్టర్ : పంచ సూత్రాలు పాటిస్తున్న మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్త్రీ నిధి బ్యాంకు ద్వారా రుణాలు మహిళల జీవనోపాదులకు భరోసా అని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలోగల రాధాకృష్ణా పురం స్వయం శక్తి సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలో 5 కోట్ల 26 లక్షల రూపాయలను మహిళలకు తమ జీవనోపాదులను మెరుగుపరుచుకోవడానికి రుణాలు మంజూరు చేశామన్నారు. గ్రామ సంఘము ద్వారా తీసుకున్న సి.ఐ.ఎఫ్. స్త్రీనిధి, ఉన్నతి రుణాలను తిరిగి చెల్లించినప్పుడు తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని సూచించారు. గ్రామ సంఘ సమావేశంలో ప్రతినెల సంఘం వారి డి.సి.బి.ల ను చదివి సభ్యులందరికీ వినిపించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక సంఘం డబ్బులను ఇంకో సంఘానికి అడ్జస్ట్మెంట్లు చేస్తే సంబంధిత సిబ్బందిని ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల సక్రమంగా కట్టిన సంఘ సభ్యులు నష్టపోతారని వివరించారు. ప్రతి నెల గ్రామ సంఘం సమావేశంలో మీరు కట్టిన రసీదుల ఆధారంగా లోన్ లెడ్జర్లను పరిశీలించుకోవాలని లోన్ తీసుకున్న సంఘ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వి.వో.ఏ. జయసుధాగురుమూర్తి తో పాటు స్వయం శక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరం



ఆమదాలవలస జూలై 21 జనం రిపోర్టర్ : ఆమదాలవలస మండలంలో నెల్లిపర్తి గ్రామం లో సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మరియు గురుపౌర్ణమి సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం లో అన్ని రకాల వ్యాధులకు అనుభవవైజ్ఞులైన డాక్టర్ లచే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ వైద్య శిబిరం లో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీటితో పాటు స్వామి వారి దివ్య సందేశం, వృద్ధులకు గొడుగుల పంపిణీ, చిన్నారులకు ప్రోటీన్ ఫుడ్ పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గౌరవ అతిదులు ఎస్.వి.గురుప్రసాద్, ఆర్.కిషోర్ మరియు పద్మావతి,అచ్యుత రావుమాస్టర్, ఎం.జనార్ధన్ రావు, సి.హెచ్.సూర్యారావు , సూర.రామచంద్రరావు, పి.నాగేశ్వరరావు, పి.తాతయ్యలు, ఎం.రవీంద్రబాబు పాల్గొన్నారు.

## కేంద్రంలో కుప్పకూలనున్న బీజేపీ ప్రభుత్వం..



కోల్‌కతా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసపూరిత ఎత్తుగడలతో అధికారం నిలబెట్టుకుంటోందని, త్వరలోనే ఆ ప్రభుత్వ కుప్పకూలుతుందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ జోస్యం చెప్పారు. పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా లో ఆదివారంనాడు జరిగిన టీఎంసీ ధర్మ్‌తలా ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, అడ్డదారులు తొక్కయినా అధికారాన్ని కైవసం చేసుకోవాలని కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. బెంగాల్ ప్రజలు బీజేపీతో పోరాడి ఆ పార్టీని వెనక్కి నెట్టేశారని అన్నారు. ఢిల్లీ గద్దెపై కూర్చున్న పాలకులు మరి కొద్దిరోజులు మాత్రమే అధికారంలో ఉంటారని చెప్పారు. లోక్‌సభలో కూడా ఇదే మాట చెప్పానని, మళ్లీ ఈరోజు కూడా అదే మాట చెబుతున్నానని అన్నారు. అతి తర్వలోనే కేంద్ర ప్రభుత్వం కుప్పకూడం ఖాయమని అన్నారు. డిప్యూటీ స్పీకర్ పదవి కోరిన కాంగ్రెస్, నీట్ అంశం ప్రస్తావన నిధులు ఆపేశారు..ప్రజలే గుణపాఠం చెప్పారు టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ, బెంగాల్‌లు నిధులను బీజేపీ ఆపేసిందని, ఇందుకు ప్రతిగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం 400 సీట్లు గెలుచుకోకుండా 240 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. టీఎంసీపై ఈడీ, సీబీఐలను ఉసిగొల్పినప్పటికీ విజయం సాధించలేకపోయారని అన్నారు. సందేశ్ ఖాలీ ఘటనపై వక్రభాష్యాలు చెప్పి బెంగాల్‌ను అప్రతిష్ట పాలు చేయాలని బీజేపీ ప్రయత్నించినప్పటికీ అక్కడి ప్రజలు తమకు బాసటగా నిలిచారని, ఇదే లోక్‌సభ సీటులో 3.50 లక్షల ఓట్లను బీజేపీ కోల్పోయిందని వివరించారు. 1993లో పశ్చిమబెంగాల్‌లో జరిగిన నిరసనలపై కాల్పులు జరపడటంతో మృతి చెందిన 13 మంది స్మృత్యర్థం టీఎంసీ ఏటా ఈ షాహిద్ దివస్ (అమరవీరుల దినోత్సవం) జరుపుతుంది

## నిర్మలా సీతారామన్ సైతం సరికొత్త చరిత్ర సృష్టించనున్నారు.

న్యూఢిల్లీ, జులై 21: వరుసగా ప్రధానిగా నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి బాధ్యతలు చేపట్టడం ద్వారా నెహ్రూ రికార్డును సమం చేశారు. అలాగే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సైతం సరికొత్త చరిత్ర సృష్టించనున్నారు. వరుసగా ఆమె ఏడోసార్లు బడ్జెట్‌ను నేరుగా సభలో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో గతంలో వరుసగా ఆరుసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డును నిర్మలమ్మ అధిగమించబోతున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండో రోజు.. అంటే మంగళవారం జులై 23న లోక్‌సభలో 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. 2019లో ప్రధానిగా నరేంద్ర మోదీ రెండో సారి బాధ్యతలు చేపట్టారు. ఆయన కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు వరుసగా ఆమె ఆరు బడ్జెట్‌లను ఆమె ప్రవేశపెట్టారు.

బంగ్లా బాధితులకు ఆశ్రయం.. కీలక ప్రకటన

అయితే ఈ ఏడాదిలో సార్వత్రిక ఎన్నికల జరిగాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో నిర్మల మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం విధితమే. అయితే 1959 నుంచి 1964 మధ్య మొరార్జీ దేశాయ్ వరుసగా ఆరు సార్లు కేంద్ర బడ్జెట్‌ను నేరుగా సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది ఎన్నికలు జరగడంతో.. మోదీ ప్రభుత్వం ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.

శ్రీ విద్యా పీఠంలో గురుపౌర్ణమి వేడుకలు

కానీ సార్వత్రిక ఎన్నికల్లో సైతం మళ్లీ ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. దీంతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో మోదీ ప్రభుత్వం కొలువు తీరింది. అయితే బీజేపీలోకి పలువురు అగ్రనేతలకు ప్రధాని మోదీ పాత శాఖలనే కేటాయించడం గమనార్హం. దీంతో నిర్మలా సీతారామన్ మళ్లీ ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

బీజేపీతోపాటు ఎల్జీపై మళ్లీ మండిపడ్డ ఆప్

ఇక 75 ఏళ్ల భారతావనిలో పలువురు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రులుగా వ్యవహరించినా.. నిర్మల, మొరార్జీ దేశాయ్‌లా వారంతా వరుసగా బడ్జెట్ ప్రవేశపెట్టక పోవడం గమనార్హం. దేశస్వాతంత్ర్యానంతరం తొలి బడ్జెట్‌ను ఆర్కే షణ్ముగం చారీ ప్రవేశపెట్టారు. ఇక నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి కేబినెట్‌లలో ఆర్థిక మంత్రిగా పని చేసిన మొరార్జీ దేశాయ్ మొత్తం 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అలాగే పి. చిదంబరం.. మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అదే విధంగా ప్రణబ్ ముఖర్జీ సైతం 8 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ అయితే 5 సార్లు సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

## జగన్ పాలనలో అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం



న్యూఢిల్లీ, జులై 21: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం న్యూఢిల్లీలో అఖిలపక్షం సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో గత అయిదేళ్లలో వైసీపీ సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తావించారు. వైఎస్ జగన్ పాలనలో చేసిన అప్పులు ఘనంగా.. అభివృద్ధి శూన్యంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్రాన్ని ఆర్థికంగా నష్ట పరిచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో జరిగిన ఈ ఆర్థిక విధ్వంసంపై టీడీపీ ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయనుందని ఈ భేటీలో ఆయన వెల్లడించారు. ఇక ఇదే భేటీలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు పాల్గొన్నారు. నీట్ అవకతవకలు, ఈడీ, సీబీఐలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేయడంపాటు లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి అంశాన్ని సైతం ఆ పార్టీ నేతలు లేవనెత్తారు. ఇక ఎన్డీయే మిత్రపక్షం జేడీ(యూ) బిహార్‌కు ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేసింది. అలాగే వైయస్ఆర్ సీపీ అయితే.. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అలాగే కన్వర్ యాత్ర నేపథ్యంలో ఆ యాత్ర సాగే ప్రాంతంలో తినుబండారశాలలు, హోటళ్ల వద్ద యాజమాన్యం పేర్లు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలంటూ ఉత్తరప్రదేశ్‌లో యోగి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశాన్ని ఈ అఖిల పక్ష భేటీలో సమాజవాదీ పార్టీ (ఎస్పీ) ప్రస్తావించింది. ఈ బడ్జెట్ సమావేశాల్లో తొలి రోజు ఆర్థిక సర్వేను కేంద్రం విడుదల చేయనుంది. ఆ మరునాడు అంటే మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టనున్నారు. న్యూఢిల్లీలోని పార్లమెంట్ అనెక్స్ భవనంలో ఆదివారం ఉదయం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఈ అఖిల పక్ష సమావేశం ప్రారంభమైంది. టీడీపీ నుంచి ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, వైసీపీ నుంచి ఎంపీ విజయసాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి గౌరవ్ గొగొయ్, కాంగ్రెస్ పార్టీ నుంచి జైరాం రమేశ్, కె.ఎస్. సురేశ్.. ఎంఐఎం నుంచి ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆర్జేడీ నుంచి అభయ్ కుశ్వా, ఆప్ నుంచి సంజయ్ సింగ్, ఎస్పీ నుంచి రామ్ గోపాల్ యాదవ్, ఎన్సీపీ నుంచి ప్రఫుల్ పటేల్ తదితరులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జులై 22న ప్రారంభమై.. ఆగస్ట్ 12వ తేదీతో ముగియనున్నాయి. ఆ సమావేశంలో ఆరు బిల్లులను ఆమోదించేందుకు మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.

## అవినీతిని వ్యవస్థీకృతం చేశారు: శరద్ పవార్‌పై అమిత్ షా ఆరోపణలు

పుణె: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు మహారాష్ట్రలోని రాజకీయపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ సారి అధికారం చేజిక్కించుకునేందుకు భాజపా తీవ్రంగా యత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని పుణెలో పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ దేశంలోనే అత్యంత అవినీతిపరుడని ఆరోపించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయినా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో అహంకారం ప్రదర్శించారని అమిత్ షా మరోసారి విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. "రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా పనితీరు మెరుగ్గా ఉంటుంది. మరోసారి రాష్ట్రంలో భాజపా కూటమి ప్రభుత్వం కొలువుతీరడం ఖాయం. స్వాతంత్ర్య పోరాట యోధుడు బాలగంగాధర్ తిలక్ పుట్టిన నేల ఇది. 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే నినాదాన్ని ఇచ్చారు. కానీ, శరద్ పవార్ అవినీతిని ఇక్కడ వ్యవస్థీకృతం చేశారు" అని షా ఆరోపించారు.




## ఘనంగా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

ఏలూరు జిల్లా జనం రిపోర్టర్ : కైకలూరు ఆటపాకలో సంతోష్ మారుతి షోరూం లో శ్రీకాంత్ జన్మదిన వేడుకలు జరుపుకున్న సిబ్బంది ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపిన యాజమాన్యం సిబ్బంది


# తెలంగాణకు పోటెత్తుతున్న వరద..




వర్షాకాలం ప్రారంభమైన నెల రోజుల తర్వాత భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదులు, వాగులు, వంకలకు జల కళ సంతరించుకుంది. కృష్ణా పరివాహక ప్రాంతానికి ఇప్పుడిప్పుడే వరద చేరుకుంటుండగా.. గోదావరి పరివాహక జలశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. మొన్నటి దాకా ఎండలతో నీరు లేక అడుగంటిన జలశయాలకు భారీగా వరద చేరుకుంటోంది. అయితే కూలిపోయిందని ప్రచారం జరిగిన కాళేశ్వరం మళ్లీ పూర్వరూపం సంతరించుకుంది. మేడిగడ్డ బ్యారేజ్ భారీ వరదతో కళకళలాడుతోంది. 85కు 85 గేట్లు తెరచుకోవడంతో వరద కిందకు వెళ్తోంది. గోదావరి పరివాహకంలోని అన్ని ప్రాజెక్టులకు భారీగా వరద చేరుతోంది. లక్ష్మీగడ్డ బ్యారేజ్ మొదలుకుని భద్రాచలం వరకు గోదావరి హోరున ప్రవహిస్తోంది.

తెలంగాణలోని ఈ జిల్లాల్లో రేపటి వరకూ అతి భారీ వర్షాలు, రెడ్ అలర్ట్ జారీ

కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ వద్ద ఉధృతంగా గోదావరి ప్రవహిస్తోంది. కాళేశ్వరం పుష్కర ఘాట్లకు నేరు చేరింది. కాళేశ్వరం గోదావరి వద్ద నీటిమట్టం 8.500 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. లక్ష్మీ బ్యారేజ్‌కి భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ 85 గేట్లు ఎత్తి 3,73,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల. ఇన్ ఫ్లో , ఔట్ ఫ్లో 3,73,500 క్యూసెక్కులు ఉంది.

లక్ష్మీ బ్యారేజ్ పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 16.17 టీఎంసీలు

హైదరాబాద్ ప్రజలకు బిగ్ అలర్ట్.. 2 రోజులు ఎంఎంటీఎస్ రైళ్లు బంద్

భద్రాచలం కొన్ని రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షలు పడటంతో వాగులు, వంకలు వర్షం నీటితో ముంచెత్తిపోతున్న తరుణంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుంది. గంటగంటకు క్రమేపి గోదావరి నీటిమట్టం పెరగటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.8 అడుగులు దాటి ప్రవహిస్తుంది. 43 అడుగులకు చేరితే ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచారు. దిగువ ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ జీతేస్ వి పాటేల్ అలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### మిడ్‌మానేర్ ప్రాజెక్టు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేరు)కు 525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి మానేరు, మూల వాగుల నుంచి వరద చేరుతోంది.పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు (318 మీటర్లు)

### ప్రస్తుత నీటి నిల్వ 5.61 టిఎంసీలు (305.33 మీటర్లు)

నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్ట్‌కు వరద నీరు చేరుతుంది. వరద ఇన్ ఫ్లో 19,686 క్యూసెక్కులు వస్తుంది. దీంతో నాలుగు గేట్లను ఎత్తివేసిన అధికారులు దిగువకు 18,227 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కొద్ది రోజుల కిందట ఎండిపోయి కడెం ప్రాజెక్టు వెలవెలపోగా.. ఇప్పుడు వరదతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2022, 23లలో కడెం ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయి ప్రమాదకర స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. రెండేళ్లు కడెం ప్రాజెక్టు భయానక పరిస్థితికి చేరుకున్న నేపథ్యంలో అధికారులు కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేశారు. అయినా కూడా పరివాహక రైతుల్లో ఆందోళన నెలకొనే ఉంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 80.5 టీఎంసీలు ప్రస్తుతం 19.185 టీఎంసీలు పూర్తి స్థాయి నీటిమట్టం 1067.40 మీటర్లు ప్రస్తుతం 332.53 మీటర్లు ఇన్‌ఫ్లో 18,518 క్యూసెక్కులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమాచారం ఇన్ ఫ్లో : నిల్ ఔట్ ఫ్లో : 9,874 క్యూసెక్కులు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు ప్రస్తుతం504.50 అడుగులు పూర్తిస్థాయి నీటి నిల్వ 312.5050 టీఎంసీలుప్రస్తుతం122.5225 టీఎంసీలు పియదర్శిని జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు ప్రస్తుతం 7.645 టీఎంసీలు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు ప్రస్తుతం 317.500 మీటర్లు శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ ఫ్లో 90,800 క్యూసెక్కులు స్పిల్ వే 17 గేట్లు ఎత్తివేత 66,810 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి: 33,084 క్యూసెక్కులు శ్రీశైలం అవుట్ ఫ్లో:- 99,894 క్యూసెక్కులు పూర్తిస్థాయి అవుట్ ఫ్లో:- 1,04,416 క్యూసెక్కులు

# దమ్ముంటే అసెంబ్లీకి జగన్ రావాలి..



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 36రాజకీయ హత్యలు జరిగాయని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా మండిపడ్డారు. నూతన ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్‌పై చర్యలు తీసుకుంటామని అనిత హెచ్చరించారు. 36హత్యలు జరిగాయని జగన్ చెప్తున్నారు, వాటి వివరాలు ఆయన ఇవ్వగలరా? అంటూ ఆమె సవాల్ విసిరారు. రాజకీయ హత్యల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి జగన్ ఇవ్వాలని, లేకుంటే ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

దమ్ముంటే అసెంబ్లీకి జగన్ రావాలి..

ఏపీ ప్రభుత్వాన్ని ఎవరైనా టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు. మైకు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు చేస్తే చట్టం ఎందుకు ఊరుకోవాలని ఆమె ప్రశ్నించారు. రాజకీయ హత్యలు జరిగాయంటూ నోటికొచ్చిన నంబర్ చెప్పేస్తే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా తప్పించుకునేందుకే ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీలో జగన్ ధర్నా చేయబోతున్నట్లు ఆమె చెప్పుకొచ్చారు. ఆయనకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీలో శాంతి భద్రతలపై మేము ప్రవేశపెట్టే శ్వేతపత్రంపై జగన్ చర్చించగలరా?, తప్పుడు ప్రచారం చేయడం ఆయనకు అలవాటుగా మారిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు ఇంకా తన మాట నమ్ముతారనే భ్రమలో ఆయన ఉన్నారని హోంమంత్రి అనిత ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిపై మాజీ మంత్రి జోగి రమేశ్ దాడి చేశారని, జై జగన్ అని అనలేదని చంద్రయ్య అనే టీడీపీ కార్యకర్తను దారుణంగా పీక కోసి చంపేశారని ఆమె గుర్తు చేశారు. రోడ్డు మీద పరదాలు కట్టడానికి, చెట్లు నరకడానికి, టీడీపీ నేతలను వేధించడం కోసం మాత్రమే పోలీసులను జగన్ వాడుకున్నారు. నెల రోజుల కాలంలో మేం ఎక్కడన్నా వైసీపీ నేతలను హౌస్ అరెస్టులు చేశామా?. అడుగడుగునా అడ్డుకున్న వైసీపీది ఆటవిక పాలనా లేక యథేచ్ఛగా రోడ్డు మీద తిరుగుతున్నా జగన్‌ను అడ్డుకోని మాదా ఆటవిక పాలన? అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో దిశా పోలీస్ స్టేషన్ ప్రారంభించిన సాయంత్రమే గ్యాంగ్ రేప్ జరిగింది. నేరాలు, హత్యలు, అత్యాచారాలపై సీఎంగా ఉన్నప్పుడు ఒక్కసారైనా స్పందించారా?. లా అండ్ ఆర్డర్, గంజాయిపై ఒక్కసారైనా సమీక్ష జరిపారా అంటూ అనిత ప్రశ్నల వర్షం కురిపించారు.

**వివేకా హత్యపై మాట్లాడగలరా?**

వినుకొండలో రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన జగన్ రాజకీయాలు మాట్లాడారే తప్ప కనీసం బాధిత కుటుంబానికి ఒక్క రూపాయి కూడా అందజేయలేదని హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సంపాదించిన అక్రమ ఆస్తిలో నుంచి డబ్బులు ఇవ్వలేకపోయిన జగన్‌కు బాధిత కుటుంబంపై ప్రేమ ఉందంటే ఎవరు నమ్ముతారంటూ ఆమె ప్రశ్నించారు. సీఎంగా ఆయన పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. అమరావతిలో ఉన్న పాపానికి ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణానికి గత ప్రభుత్వం డబ్బులు కూడా ఇవ్వలేదు. ఢిల్లీలో జగన్ కూర్చొని వివేకా హత్య గురించి చెప్పగలరా?. చంద్రబాబుపై రాళ్లు వేసి భావ ప్రకటన స్వేచ్ఛ అని కామెంట్లు చేసిన వైసీపీ నేతలా మమ్మల్ని విమర్శిస్తోందని ఆమె దుయ్యబట్టారు. గతంలో ఏం జరిగిందో గుర్తు చేసుకో పులివెందుల ఎమ్మెల్యే అంటూ ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఐదేళ్లపాటు రాజారెడ్డి రాజ్యాంగం!

ఏపీలో గత ఐదేళ్లలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని హోంమంత్రి ధ్వజమెత్తారు. వైసీపీ నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, విజయసాయి రెడ్డి అంశాన్ని పక్కకు పెట్టేందుకే రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయంటూ జగన్ హడివిడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం మీద కావాలనే నిందలు వేస్తున్నారు. రాజకీయ హత్యలు కేవలం 4మాత్రమే జరిగాయని, బాధితుల్లో ముగ్గురు టీడీపీ నాయకులే ఉన్నట్లు ఆమె చెప్పుకొచ్చారు. అధికారం కోల్పోయిన నెల రోజుల్లోనే జగన్‌కు అధికార కాంక్ష పట్టుకుంది. చంపుకోవడం తప్పు దాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎం కుర్చీలో కూర్చోవడం కోసం బాబాయి హత్య, కోడికత్తి డ్రామా నడిపారు. ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తే జగన్‌పై కూడా కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. జగన్ అకృత్యాలపై మేము కూడా ఢిల్లీలో మాట్లాడతాం. వినుకొండ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై కేసు నమోదు చేస్తామని హోం మంత్రి అనిత హెచ్చరించారు.




## మోదీ సర్కార్‌పై జనాగ్రహం తప్పదు : ఖర్గే వార్నింగ్

ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న రైలు ప్రమాదాలపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం లక్ష్యంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం రైలు ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు చేపట్టకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. రైల్వే శాఖలో ఎన్నో ఖాళీలున్నాయని, కీలక సాంకేతిక విభాగంలో ఖాళీలను భర్తీ చేయకుంటే రైల్వేలు సహజంగానే నిర్వీర్యమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే శాఖ బలహీనపడటంతోనే రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. రైల్వేలు నీరుగారడంతోనే రైలు ప్రమాదాలు ఒకదాని వెంట ఒకటి జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైల్వేలకు సకాలంలో నిధులు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. వందలాది ప్రాణాలు రైల్వే ప్రమాదంలో గాలిలో కలిసిపోతున్నాయని, దీని గురించి ప్రభుత్వం ఆలోచించకుంటే ప్రజలే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని ఖర్గే హెచ్చరించారు.ఇక ఇటీవల యూపీలోని గోండా వద్ద చండీఘఢ్-దిబ్రూఘఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన ఘటనలో ముగ్గురు మరణించగా, 30 మందికి గాయాలయ్యాయి. ఇక ఆదివారం మధుర ట్రాక్‌పై ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఇతరులతో చర్చించకుండా బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా బడ్జెట్ రూపొందిస్తోందని ఖర్గే ఆరోపించారు. బీజేపీ తమ ఆలోచనల గురించి ఎవరితో పంచుకోకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తోందని, బడ్జెట్ విషయంలో రాష్ట్రాల సూచనలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై



## మండిపడ్డ హరీశ్ రావు


కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ సమావేశం ముగిసిన అనంతరం తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అవాకులు చెవాకులు పేలారంటూ మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఢిల్లీలో పత్రికా సమావేశం నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడారని, అవగాహనా రాహిత్యాన్ని మరొక్కసారి బయటపెట్టుకున్నారని చెప్పారు. ఒకవైపు మేడిగడ్డ పునాదిని బలపరిచేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం అని అంటూనే మేడిగడ్డ వద్ద మట్టి పరీక్షలు సాధ్యపడలేదు అని అంటున్నారని విమర్శించారు. ఈ ఏడాది మే 5న ఒక నివేదిక ఇచ్చిన వర్షాకాలం వరదలు రాకముందే.. జులై మొదటి వారం లోపే పలు సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని నివేదికలో పేర్కొన్నదని తెలిపారు. సూచనలతో..త జూన్ రెండో వారంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు లతో సాంకేతిక పరీక్షలు చేయించాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం రెండు సంస్థలు సాంకేతిక పరీక్షలకు ఉపక్రమించే సమయానికి వరద రావడంతో టెస్ట్

# బలహీనపడిన వాయుగుండం..




రాష్ట్రంలో రెండు రోజుల నుంచి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీన పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం బలహీనపడి కదులుతూ అల్పపీడనంగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఈక్రమంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు దిశగా కదులుతూ నేడు(ఆదివారం) మరింత బలహీన పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఏపీలో కొన్ని చోట్ల భారీ వర్షాలు, మిగతా చోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. ఇవాళ మన్యం, అల్లూరి , కాకినాడ, కోనసీమ, తూ.గో, ప.గో, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగతా చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# పెన్షన్ల పంపిణీలో భారీ మార్పులు



ఏపీలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక సామాజిక చోటు చేసుకున్నాయి. గతంలో వాలంటీర్ల సాయంతో వైసీపీ సర్కార్ అందించిన పెన్షన్ల స్థానంలో కూటమి సర్కార్ సచివాలయ సిబ్బందితో వీటిని అందజేస్తోంది. ఎన్నికల హామీ మేరకు పెంచిన పెన్షన్లను ఈ మేరకు కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు గత నెలలో దగ్గరుండి పంపిణీ చేయించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఇకపై ప్రతీ నెలా ఒకటో తేదీన జరిగే పెన్షన్ల పంపిణీలో తమ పార్టీ టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర స్థానిక నేతలు తప్పనిసరిగా పాల్గొనాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. అంతే కాదు ఈ కార్యక్రమంలో పాల్గొనే విషయంలో ఎలాంటి సాకులు చెప్పొద్దని తేల్చిచెప్పేసారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో విధిగా పాల్గొనాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతీ నెలా ఒకటో తేదీ ఎంత ముఖ్యమైన సమావేశాలున్నా వాయిదా వేసుకుని పెన్షన్లు పంపిణీ చేయాలని టీడీపీ నేతలను చంద్రబాబు ఆదేశించారు. తద్వారా 2029లోనూ పార్టీ గెలవడానికి ఇప్పటి నుంచే అడుగులు వేయాలని సూచించారు. పార్టీ, ప్రభుత్వం మధ్య అనుసంధానం ఉండాలని, ప్రతి మంత్రి, ఎంపీ వారంలో ఒక రోజు పార్టీ కార్యాలయానికి వెళ్లాలని కూడా బాబు ఆదేశించారు. ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు తీసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడూ విధిగా పార్టీ కార్యాలయాలను సందర్శించాలని మరో ఆదేశం ఇచ్చారు. ఎన్డీయే నేతలతో సమావేశమవ్వాలని, కార్యకర్తలకు అండగా నిలబడాలని, వారికి తగిన సాయం చేయాలని సూచించారు.

# ఐటీ ఉద్యోగుల పని గంటలు పెంపు?



కర్ణాటక రాష్ట్రంలోని ఐటీ సహా ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో 50 శాతం నుంచి వంద శాతం వరకు స్థానికులకే రిజర్వేషన్ కల్పించాలని ఆ రాష్ట్ర కేబినెట్ ఇటీవల ఓ బిల్లును ఆమోదించి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కార్ మరో వివాదాస్పద నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఐటీ ఉద్యోగుల పని వేళలను రోజుకు 10 గంటల నుంచి 14 గంటలకు పొడిగించాలని కర్ణాటక ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీని కోసం కర్ణాటక షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, 1961ని సవరించాలని చూస్తోంది. ఐటీ రంగ సంఘాల నుంచి దీనిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజా ప్రతిపాదన ప్రకారం ఐటీ, ఐటీఈఎస్, బీపీఓ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు రోజులో 12 గంటలకు మించి పనిచేసేందుకు కొత్త బిల్లు అనుమతిస్తుంది. రోజులో గరిష్ఠంగా 14గంటల చొప్పున పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం ఎక్కువ గంటలతో కలిపి గరిష్ఠంగా 10గంటలు మాత్రమే పనిచేయించేందుకు అనుమతి ఉంది. అయితే వరుసగా మూడునెలల్లో ఉద్యోగితో 125 గంటలకు మించి అదనపు గంటలు పని చేయించకూడదు. ఐటీ ఉద్యోగుల పనిగంటల పెంపు ప్రతిపాదనలు వచ్చాయని, ఆ విషయమై ఇంకా చర్చలు జరుగుతున్నట్లు కర్ణాటక కార్మిక శాఖ మంత్రి మీడియాకు తెలిపారు. పనిగంటల పెంపుపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన సరికాదని కర్ణాటక రాష్ట్ర ఐటీ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్‌ను కలిసి తమ అభ్యంతరం తెలిపారు. పని గంటల పెంపు వల్ల ఉద్యోగులు మరింత మానసిక, శారీరక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# కేరళలో 14 ఏళ్ల బాలుడికి నిఫా వైరస్ నిర్ధారణ




హైదరాబాద్ దేశంలో మరోసారి నిఫా వైరస్ కలకలం రేగింది. కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన ఓ 14 ఏళ్ల బాలుడికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని కేరళ వైద్య శాఖ మంత్రి వీణా జార్జ్ ప్రకటించారు. బాలుడి శాంపుల్స్ను పూణేలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీలో (ఎన్ఐవీ) పరీక్షించామని వెల్లడించారు. బాలుడు ప్రస్తుతం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని వివరించారు. పర్యవేక్షణతో కూడిన చికిత్స కోసం అతడిని కోజికోడ్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తరలిస్తామని ఆమె వివరించారు. బాలుడిని కాంటాక్ట్ అయిన వారిని గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, వైరస్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న వ్యక్తులను ఇప్పటికే వేరు చేశామని, వారి నమూనాలను సైతం పరీక్షల కోసం పంపామని వీణా జార్జ్ మీడియాకు వివరించారు. చికిత్స పొందుతున్న బాలువు ప్రస్తుతం వెంటిలేటర్పై ఉన్నాడని ఆమె చెప్పారు. నిఫా వైరస్ కేంద్రం పండిక్కాడ్ అని, ఇప్పటికే ముందుజాగ్రత్త చర్యలు ప్రారంభించామని పేర్కొన్నారు. వైరస్ కేంద్రం పండిక్కాడ్తో పాటు సమీపంలోని ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ముసుగులు ధరించాలని, ఆసుపత్రులలో పేషెంట్లను సందర్శించడం మానుకోవాలని సూచనలు చేసినట్టు మంత్రి తెలిపారు. కాగా గతంలోనూ నాలుగు సార్లు కేరళ రాష్ట్రాన్ని నిఫా వైరస్ వణికించింది. 2018, 2021, 2023లలో కోజికోడ్ జిల్లాలో, 2019లో ఎర్నాకులం జిల్లాలో నిఫా కేసులు నిర్ధారణ అయ్యాయి. కోజికోడ్, వయనాడ్, ఇడుక్కి, మలప్పురం, ఎర్నాకులం జిల్లాల్లోని గబ్బిలాలలో నిఫా వైరస్ యాంటీబాడీల ఉనికిని గుర్తించారు. కాగా నిఫా వైరస్ కరోనా కంటే ప్రమాదకరమైనదని నిపుణులు చెబుతున్నారు. గబ్బిలాల ద్వారా ఈ వైరస్ మనుషులకు సోకుతుంది.

# నీట్ యూజీ ఫలితాలు విడుదల



పరీక్షా కేంద్రాల వారీగా ఎన్టీఏ వెబ్సైట్లో వెల్లడిన్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం నీట్ యూజీ 2024 ఫలితాలను తన వెబ్సైట్లో ప్రచురించింది. నీట్ యూజీ 2024 పరీక్షలో అక్రమాలు చోటుచేసుకోవడంపై తీవ్ర దుమారం రేగడం, ఈక్రమంలోనే గ్రేస్ మార్కులు పొందిన అభ్యర్థులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మళ్లీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ విచారణలో భాగంగా పరీక్షా కేంద్రాల వారీగా ఫలితాలు వెల్లడించాలని సుప్రీంలో పిటిషన్లు సైతం దాఖలయ్యాయి. దీంతో సుప్రీం పరీక్షా కేంద్రాల వారీగా ఫలితాలు వెల్లడించాలని ఎన్టీఏకు ఆదేశించింది. ప్రతి సెంటర్, ప్రతి నగరానికి చెందిన ఫలితాలను తెలపాలని పేర్కొంది. ఆ ఆదేశాల మేరకే శనివారం నీట్ యూజీ ఫలితాలను వెబ్సైట్లో విడుదల చేశారు. ఈ ఫలితాలను జులైట్కు 20 మధ్యాహ్నం 12 గంటల లోపు రిలీజ్ చేయాలని సుప్రీం గడువు విధించింది. అయితే అభ్యరు ్ధల గుర్తింపును మాత్రం గోప్యంగా ఉంచాలని సూచించింది. నీట్-యూజీలో అక్రమాలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి డీవై చంద్రచూడ్ నేతత్వంలోని జస్టిస్ పీబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పూర్తిస్థాయిలో పరీక్షల పవిత్రత దెబ్బతిన్నదని ఒక బలమైన నిర్ధారణకు వస్తేనే మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశిస్తామని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# వంకాయలో ఉన్న అద్భుత ప్రయోజనాలు.



ప్రస్తుత కాలంలో ఆరోగ్యమే మహాభాగ్యంగా పాటిస్తున్నారు ప్రతి ఒక్కరూ. అయితే హెల్త్ విషయంలో కూడా నిత్యం తీసుకునే ఆహారంలో కూరగాయలు వాటిల్లో ఉండే పోషకాలు మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయి అనే విషయాలు తెలుసుకోవడం కూడా ముఖ్యమే. అయితే అన్నింటిలో వంకాయ ప్రస్తుతం ట్రెండింగ్ వెజిటేబుల్ గా మారింది అని చెప్పొచ్చు. పండ్లలో రారాజు మామిడి పండు ఎలాగో కూరగాయలో రాజు వంకాయ అని చెబుతూ ఉంటారు. అయితే ఈ వంకాయ మీద తెలుగు సినిమాలలో ఎన్నో పాటలు మరియు చాలా కవిత్వాలు కూడా ఉన్నాయి. అంత ఫేమస్ అన్నమాట ఈ వంకాయ. అలాంటి వంకాయతో ఆరోగ్యపరంగా పుష్కలమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఈ వంకాయ అనేది అన్ని కూరగాయల లాగే ఒక మామూలు కూరగాయ అయినప్పటికీ చాలా మంది మాత్రం దీనిని ఎక్కువగా తినటానికి ఇష్టపడతారు. దీనిని అందరూ తినడానికి ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. ఈ వంకాయలు కేవలం మన దేశంలోనే కాక ప్రపంచం మొత్తం కూడా ఎక్కువగా ఇష్టపడి తింటుంటారు. అయితే చైనా, బంగ్లాదేశ్,ఫిలిప్పీన్స్ దేశ ప్రజలు మాత్రం ఈ వంకాయలను తక్కువగా తీసుకుంటూ ఉంటారు. అయితే ఇంతకు ఈ వంకాయలలో ఉండే పోషకాలు ఏమిటో చూద్దాం వంకాయలలో కెరోటి నాయిడ్స్ అనే పోషకాలు అధికంగా ఉన్నాయి. ఈ కెరోటినాయిడ్స్ విటమిన్ లోపాన్ని కూడా కంట్రోల్ చేస్తుంది. కావున వంకాయలు తీసుకోవడం వలన విటమిన్ %ా% మనకు తగినంత లభిస్తుంది అని వైద్యులు అంటున్నారు. అయితే విటమిన్ తో కంటి చూపు కూడా ఎంతో మెరుగుపడుతుంది. అయితే నిత్యం మన ఆహారంలో ఈ వంకాయలను కనుక తీసుకున్నట్లయితే కంటి సమస్యలకు కూడా చెక్ పెట్టొచ్చు అని అంటున్నారు. అలాగే వంకాయలలో ఫైబర్ అనేది అధికంగా ఉంటుంది. అంతేకాక కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. కావున టైప్ 2 డయాబెటిస్ తో బాధపడుతున్నటువంటి వారికి దానిని తగ్గించడంలో ఎంతో మేలు చేస్తుంది. వంకాయలో ఉన్న అద్భుత ప్రయోజనాలు ఈ వ్యాధులకు చెక్ పెట్టినట్లే ఈ వంకాయలలో కేలరీలు అనేవి చాలా తక్కువ పరిమాణంలో ఉంటాయి. అలాగే వీటిని తిన్న తర్వాత జీర్ణం కూడా తొందరగా అవుతుంది. అంతేకాక బాడీలో ఉన్న కొవ్వును నియంత్రించడంలో కూడా వంకాయలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ప్రస్తుత ఒక జాగ్రత్త మాత్రం తీసుకోవాలి. ఈ వంకాయను కూర వండేటప్పుడు నూనె చాలా తక్కువ ఉపయోగించాల్సి ఉంటుంది అని వైద్యులు అంటున్నారు. దీనికి ఎక్కువ ఆయిల్ వాడటం వలన దీనిలో ఉండే పోషక విలువలు అనేవి తగ్గిపోతాయి. వీటితో పాటుగా వంకాయలను ప్రతినిత్యం తీసుకోవడం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్ మరియు కడుపు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం చాలావరకు ఉండదు అని వైద్య నిపుణులు అంటున్నారు. అంతేకాక ఈ వంకాయలు శరీరంలో ఉన్న విషపు వ్యర్థాలను కూడా బయటకు పంపి ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. కావున ఇన్ని అద్భుతాలు ఉన్నటువంటి ఈ వంకాయలు ఆరోగ్యకర విలువలు ఉన్న ఈ వంకాయలను మిస్ అవ్వద్దు అని అంటున్నారు

# యువతి తలలోకి 70 సూదులు దింపిన మాంత్రికుడు




ఒడిశాఅనారోగ్యంతో ఉన్న యువతి తలలో చికిత్స పేరిట 70 సూదులు దింపిన మాంత్రికుడి ఉదంతం ప్రస్తుతం ఒడిశాలో కలకలం రేపుతోంది. సూదులు పుర్రెను దాటి మెదడు దాకా వెళ్లకపోవడంతో యువతికి ప్రాణాపాయం తప్పింది. ఒడిశా రాష్ట్రంలోని బలంగీర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. లంగీర్ జిల్లాలోని సింధేకెలా పోలీస్? తెలిపిన వివరాల ప్రకారం, స్థానిక సింథికేలా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇచ్గావ్ గ్రామానికి చెందిన రేష్మా బెహారా (19) మూడేళ్ల క్రితం అనారోగ్యం బారిన పడింది. రేష్మా కొన్నేళ్ల క్రితం విచిత్రంగా ప్రవర్తించింది. తన చేతిని పలుమార్లు కోసుకుంది. దీంతో ఆమెను కుటుంబసభ్యులు స్థానిక వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. అయితే వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు, ఆమె ఆరోగ్యంగానే ఉందని ధ్రువీకరించారు. ఆ తర్వాత కొద్ది రోజులకు మళ్లీ అలానే ప్రవర్తించింది. అప్పుడు యువతికి దెయ్యం పట్టిందని భావించి తేజ్రాజ్ అనే మాంత్రికుడి వద్దకు తీసుకెళ్లాడు తండ్రి. ఆ మాంత్రికుడి చికిత్స పేరుతో యువతి తలలోకి ఓ సూది చొప్పించాడు. అలా కొన్ని నెలలుగా సూదులను చొప్పిస్తూనే ఉన్నాడు. ఈ విషయం యువతి కుటుంబసభ్యులకు తెలియకుండా జరిగింది. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి ఇటీవల విషమంగా మారింది. దీంతో కుటుంబసభ్యులు గురువారం రాత్రి బలంగిలో భీమ్భోయి మెడికల్ కాలేజీలో చేర్పించారు. అక్కడ సీటీ స్కాన్లో యువతి తలలో అనేక సూదులు ఉన్నట్లు తేలింది. అనంతరం బర్ల భీంసార్లో ఉన్న వింసార్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ 10 మంది సభ్యులతో కూడిన వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి యువతి తల నుంచి 70 సూదులను బయటకు తీశారు. '4 సంవత్సరాల క్రితం యువతి అనారోగ్యానికి గురైంది. ఆ సమయంలో తాంత్రికుడి వద్దకు తీసుకెళ్లారు కుటుంబసభ్యులు. యువతి తలపైనుంచి లోపలకు ఒక్కొక్కటిగా సూదులు చొప్పించాడు. ఇది నాలుగేళ్లుగా జరుగుతోంది. యువతి ఆరోగ్యం విషమించడం వల్ల ఆస్పత్రికి తీసుకురాగా శస్త్ర చికిత్స చేసి 70 సూదులు తొలగించారు వైద్యులు. దాదాపు 2 గంటల పాటు సర్జరీ జరిగింది'. పుర్రె ఎముకపై ఉన్న సూదులు లోపలికి వెళ్లకపోవడంతో ఆమె ప్రాణాలతో బయటపడిందని వింసార్కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రబినారాయణ్ గురు తెలిపారు. పోలీసులు మాంత్రికుడు తేజ్రాజ్ను అరెస్టు చేశారు.

**- అసంఘటిత రంగంలో తీవ్ర సంక్షోభం-**

**పదేండ్లుగా నలిగిపోతున్న కార్మికులు**

**- ఆర్థిక వ్యవస్థలో మోడీ సర్కారు వైఫల్యమే కారణం**

# ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు



న్యూఢిల్లీ : నిజమైన వేతనాలు అత్యంత ముఖ్యమైన ఆర్థిక సూచికలలో ఒకటి. దేశ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వేగంగా పెరుగుతున్నప్పటికీ వాస్తవ వేతనాలలో గణనీయమైన పెరుగుదల లేకుంటే, వృద్ధి నమూనాలో ఏదో స్పష్టమైన లోపం ఉన్నట్టుగా చెప్తారు. లేబర్ బ్యూరో, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) ఇటీవల విడుదల చేసిన డేటాను బట్టి చూస్తే.. ఈ రోజు భారత ఆర్థిక వ్యవస్థలో సరిగ్గా అదే జరుగుతున్నట్టు కనిపిస్తున్నది. మోడీ గత పదేండ్ల పాలనలో వాస్తవ వేతనాల యొక్క వాస్తవిక స్తబ్దతను సూచిస్తున్నాయి. దీంతో అసంఘటిత రంగంలో తీవ్ర సంక్షోభం కనిపిస్తున్నది. ఇందులో పని చేసే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. మోడీ సర్కారు అనాలోచిత విధానాలతో ఆర్థిక వ్యవస్థ వైఫల్యం చెందిన కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. నిజమైన వేతనాలు ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేయబడిన డబ్బు వేతనాలను సూచిస్తాయి. సాధారణ కార్మికుల కోసం ఒక రోజు పని కొనుగోలు శక్తిని కొలుస్తారు. సహజంగానే, అవి వృత్తులు , స్థానాల మధ్య మారుతూ ఉంటాయి.భారతదేశ లేబర్ బ్యూరో దేశవ్యాప్తంగా 66 ప్రాంతాలలో విస్తరించి ఉన్న 600 గ్రామాల స్థిర నమూనా నుంచి రోజువారీ వేతనాలపై నెలవారీ సమాచారాన్ని సేకరిస్తుంది. ఇది గ్రామీణ భారతదేశంలో వేతన రేట్లు(డబ్ల్యూఆర్ఆర్ఐ) సిరీస్. ఈ సిరీస్ 25 వ్యవసాయ, వ్యవసాయేతర వృత్తులకు సంబంధించిన వృత్తి-నిర్దిష్ట డబ్బు వేతనాలపై దృష్టి పెడుతుంది.డబ్ల్యూఆర్ఆర్ఐ డేటా ప్రకారం.. 2014 నుంచి గ్రామీణ ప్రాంతాలలో నిజమైన వేతనాల యొక్క భయంకరమైన స్తబ్దతను సూచిస్తున్నది. ఈ స్తబ్దత నమూనా ఇప్పటికీ కొనసాగుతున్నది. గత పదేండ్లలో వాస్తవ వేతనాల వార్షిక వృద్ధి రేటు అఖిల భారత స్థాయిలో సున్నాకి దగ్గరగా ఉన్నది. వాస్తవ వేతనాల వార్షిక వద్ధి రేట్లు 2014-15 నుంచి 2023-24 వరకు శాతాల్లో చూస్తే.. సాధారణ వ్యవసాయ కార్మికుల్లో మహిళలు 0.8 శాతం, పురుషుల్లో 1.1 శాతంగా ఉన్నాయి. వ్యవసాయేతర కార్మికుల విషయంలో ఇది వరుసగా 0.1 శాతం, 0 శాతం, నిర్మాణ కార్మికులలో వరుసగా 0.2 శాతం, 0.5 శాతం ఉన్నాయి. ఎన్ఎస్-ఎస్ఓ 2021-22 నుంచి 2022-23 మధ్య నిర్వహించిన అన్ఇన్కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్ప్రైజెస్(ఏఎస్యూఎస్ఈ) వార్షిక సర్వేలోనూ ఆసక్తికర విషయాలు బయటపడ్డాయని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. అంటే, 2015-16కి ముందు నిజమైన వేతనాలు వేగంగా పెరుగుతున్నాయి. కానీ ఆ తర్వాత వర్చువల్గా నిలిచిపోయాయి. 2010-11 నుంచి 2015-16 మధ్య కాలంలో ఒక అద్దె కార్మికుని వార్షిక వేతనాల వృద్ధి రేటు 7 శాతానికి దగ్గరగా ఉన్నది. కానీ 2015-16 నుంచి 2022-23 మధ్య దాదాపు సున్నా కావటం గమనార్హం. 2021-22 నుంచి 2022-23 మధ్య వాస్తవ వేతనాలలో అస్పష్టమైన క్షీణత కారణంగా వృద్ధి రేట్లు కొంత వరకు తగ్గాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలు(పీఎల్ఎఫ్ఎస్) కూడా 2022-23లో నిజమైన వేతనాల్లో తగ్గుదలని సూచిస్తుండటం గమనార్హం. జనాభాపై జాతీయ కమిషన్ జనాభా అంచనాల ప్రకారం.. మొత్తం జనాభాలో పని చేసే వయస్సు జనాభా (15-59 సంవత్సరాలు) వాటా గత 20 ఏండ్లలో క్రమంగా పెరుగుతున్నది. నిజమైన వేతనాలు నిలిచి పోయిన ప్పటికీ పేదరికం తగ్గుదలకు ఇది దోహదప దుతుందని అంచనాలు చెప్తున్నాయి. నిజమైన వేతనాల స్తబ్దత అసంఘటిత రంగంలో తీవ్ర సంక్షోభాన్ని సూచిస్తుంది. వాస్తవ వేతనాల్లో పెద్దగా పెరుగుదల లేకుండా 10 సంవత్సరాల పాటు ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొ ంటున్నది. ఈ కాలంలో అసంఘటిత రంగం పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను(జీఎస్టీ), కోవిడ్-19 సంక్షోభం వంటి మూడు పెద్ద విపత్తులను చూసింది. అసంఘటిత రంగంలో నిజమైన వేతనాల స్తబ్దత భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన వైఫల్యమని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అర్ధ సత్యాలు వక్రీకరణలు

**- వాస్తవ చిత్రాన్ని ప్రతిబింబించని ఆర్థిక సర్వేలు**

**- ఫీల్ గుడ్ అంటూ పాలకుల కాలక్షేపం**

**- పెరుగుతున్న ప్రజా సమస్యలు లభించని పరిష్కారాలు**

**- చేదు అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోని ప్రభుత్వం**

**- విధాన మార్పులు తప్పవంటున్న ఆర్థిక నిపుణులు**

కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వం ఈ నెల 23న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టబోతోంది. గత బీజేపీ ప్రభుత్వం ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ను సమర్పించిన విషయం తెలిసిందే. బడ్జెట్ సమర్పణకు ముందు గత సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత సంవత్సరం ఆర్థిక వ్యవస్థ పనితీరు ఎలా ఉంది, రాబోయే కాలంలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది అనే అంశాలను అందులో పొందుపరుస్తారు. ప్రభుత్వం తీసుకోబోయే దిద్దుబాటు చర్యలను ఈ సర్వే సూచిస్తుంది. అయితే ప్రభుత్వం గత అనుభవాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోవడం లేదని, దిద్దుబాటు చర్యల ఊసే ఉండడం లేదని ఇటీవలి అనుభవాలు చెబుతున్నాయి. న్యూఢిల్లీ :ప్రభుత్వ రాజకీయ నిర్ణయాలు ప్రజల అవసరాలకు భిన్నంగా ఉంటాయి. బడ్జెట్ చాలా మందికి కొరుకుడు పడని పత్రాల సమాహారం. అది ఓ అంకెల గారడీ. ప్రజాకర్షణ పథకాల ప్రకటనతో నిండి ఉంటుంది. అయినప్పటికీ ప్రజా సమస్యలు యథావిధిగా అపరిష్కృతంగా ఉంటూనే ఉంటాయి. అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అంతా భేషుగ్గా ఉన్నదని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం అందులో చెప్పుకుంటుంది. బడ్జెట్లో బయటపెట్టే సమాచారం కూడా పరిమితమైనదే. ముందుగానే ఎంపిక చేసుకొని దానిని బడ్జెట్లో పొందుపరుస్తారు. పూర్తి చిత్రం బయటపడదు కాబట్టి ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి విశ్లేషకులు ఇతర అంశాలను కూడా పరిశీలిస్తారు. ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు బడ్జెట్ను పొగుడుతుంటే విమర్శకులు వాస్తవ చిత్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తారు.

2011 లెక్కలే ప్రామాణికం

బడ్జెట్లో రెండు ప్రధానాంశాలు ఉన్నాయి. మొదటిది కీలక సమాచారం బయటపెట్టకపోవడం. రెండోది అందించిన సమాచారం కూడా అవాస్తవాలతో కూడుకోవడం. ఉదాహరణకు 2021లో జనగణన చేయాల్సి ఉంది. కోవిడ్ తర్వాత పలు దేశాలు జనాభా లెక్కలు సేకరించినప్పటికీ మన ప్రభుత్వం ఆ ప్రక్రియను ఇంకా ప్రారంభించనే లేదు. పలు సర్వేల నిర్వహణ, సమాచార సేకరణ కోసం జనగణన అవసరమవుతుంది. ఇప్పుడు అన్నింటికీ 2011 లెక్కలనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే అప్పటి నుండి దేశంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కాబట్టి ఫలితాలు 2024 పరిస్థితిని ప్రతిబింబించవు. ఉపాధి, వ్యవసాయోత్పత్తి, అసంఘటిత రంగం, పేదరికం, అసమానతలు వంటి అంశాలకు సంబంధించిన సమాచారాన్ని వక్రీకరించి చూపుతున్నారు.

దిగజారిన ర్యాంకింగులు

స్టాక్ మార్కెట్ మదింపులు రికార్డు స్థాయిలో ఉండడాన్ని చూస్తుంటే కోవిడ్ తర్వాత సంఘటిత రంగం ఎలా కోలుకున్నదీ అవగతమవుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు సూచిక అని ప్రభుత్వం చెబుతోంది. విదేశీ మదుపరులు కూడా సంఘటిత రంగంలోనే పెట్టుబడులు పెడుతున్నారు. అసంఘటిత రంగంపై వారికి ఆసక్తి లేదు. ఇక్కడ ఓ విషయాన్ని గమనించాల్సి ఉంది. నిరుద్యోగం, వినియోగంపై జాతీయ సమాచారాన్ని ఇవ్వడానికి నిరాకరించడమే కాదు ఆకలి, పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వంటి విషయాలలో అంతర్జాతీయ సూచికలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ దానిని అంగీకరించేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. అంతర్జాతీయ ర్యాంకింగులు వంద శాతం కచ్చితమైనవి కాకపోయినప్పటికీ దిగజారుతున్న మన స్థాయిని ప్రతిబింబిస్తున్నాయి. కొన్ని సూచికలలో ఇతర దేశాల కంటే మన దేశం పనితీరు దారుణంగా ఉంది. గత దశాబ్ద కాలంలో పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం క్షీణించాయి. పాలకుల నిరంకుశత్వం కారణంగా మతపరమైన వేధింపులు పెరిగిపోయాయి. ప్రతిపక్షాలపై దాడి చేసేందుకు దర్యాప్తు సంస్థలను ఓ పథకం ప్రకారం ఉపయోగించుకుంటున్నారు.

పాఠాలు నేర్వని ప్రభుత్వం

సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రభుత్వం తొలిసారి ఆర్థిక సర్వేను ప్రవేశపెడుతోంది. ఎన్నికల్లో ఎదురైన ఎదురు దెబ్బల నుండి పాలకులు గుణపాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించడానికి విధానాలలో మార్పులు చేసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో గత ఐదు సంవత్సరాల వాస్తవ చిత్రాన్ని ఆర్థిక సర్వే ప్రజల ముందు ఉంచాలి. లోక్సభ ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయడానికి పెరుగుతున్న ఆర్థిక అశాంతి మాత్రమే కారణం కాదు. ప్రజల వ్యతిరేకతకు నేపథ్యం కూడా కారణమే. ఒకవేళ అంతా బాగుంది అని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం చెప్పుకుంటే విధానాల్లో మౌలిక మార్పులు చేయాల్సిన అవసరం ఉండదు. ప్రజా సమస్యలు అలాగే ఉంటాయి. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానానికి ప్రభుత్వం స్పష్టి చెబితే మంచిది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, # /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15,NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.).
Cell:9398156948,REG.RNI:APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com